ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -180 పేజీలు - 084 వెల - 04/-

బుధవారం 23 ఏప్రిల్ 2025

# బనకచర్లపై ప్రతిపాదనలు

**ఢిల్లీ పర్యటనలో బిజీగా సిఎం చంద్రబాబు**

**కేంద్రమంత్రి అమిత్ షాతో రాజ్యసభపై చర్చ?**

**కేంద్రమంత్రి పాటిల్‌తో బనకచర్లపై ప్రతిపాదనలు**



న్యూఢిల్లీ ,ఏప్రిల్ 22,ఆంధ్ర ప్రగతి: ఢిల్లీ పర్యటనలో ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు బిజీబిజీగా గడిపారు. పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు సమస్యలపై చర్చించిన సీఎం చంద్రబాబు.. కేంద్ర హోంశాఖ మంత్రితో కీలక చర్చలు జరిపారు.. ప్రధానంగా రాజ్యసభ ఉప ఎన్నికలపై చర్చించినట్టుగా తెలుస్తోంది.. ఏపీ నుంచి ఖాళీ అయిన రాజ్యసభ స్థానాన్ని భర్తీ చేసే అంశంపై నిర్ణయం తీసుకున్నట్టుగా సమాచారం.. విజయసాయి రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానం భర్తీపై ప్రధానంగా చర్చ జరిగినట్టుగా చెబుతున్నారు.. నామినేషన్ దాఖలుకు ఈ నెల 29వ తేదీ తుది గడువు ముగియనుంది. ఇప్పటి వరకు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మొత్తం నలుగురు రాజ్యసభ సభ్యులు రాజీనామా చేశారు.. మోపిదేవి వేంకట రమణ, బీద మస్తాన్ రావు, ఆర్ కృష్ణయ్య, విజయసాయి రెడ్డి.. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామాలు చేయగా, ఇప్పటికి మూడు స్థానాలు భర్తీ చేశారు.. ఇక, మిగిలిపోయిన నాల్గో స్థానం భర్తీపై
బీజేపీ, టీడీపీ మధ్య చర్చలు జరిగాయని తెలుస్తోంది..

మిగతా 2లో



# పర్యాటకులపై పాశవికం



**పహల్గాంలోని బైసరన్ వ్యాలీ లో ఉగ్ర దాడి ఘటన**

**20 మందికి పైగా మృతి?**

**జమ్మూ కశ్మీర్ లో దాడికి పాల్పడింది మేమే: టీఆర్ఎఫ్**

**లష్కరే తోయిబా సంస్థకు అనుబంధంగా పనిచేస్తున్న టీఆర్ఎఫ్!**

**ఉగ్రవాదులను వదిలే ప్రసక్తి లేదు**

**హోంమంత్రి అమిత్ షాకు మోడీ ఫోన్**

**ఘటనను తీవ్రంగా ఖండించిన ప్రధాని, అమిత్ షా**

జమ్మూ కాశ్మీర్ ఏప్రిల్ 22,ఆంధ్ర ప్రగతి: జమ్మూ కాశ్మీర్‌లో ప్రముఖ పర్యాటక కేంద్రమైన పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. దక్షిణ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పరిధిలోని బైసరన్ మైదాన ప్రాంతంలో మంగళవారం మధ్యాహ్నం ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. ఈ దాడిలో 20 మందికి పైగా మరణించినట్టు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. మృతుల్లో విదేశీ పర్యాటకులు కూడా ఉన్నట్టు సమాచారం. కాగా, ఈ క్రూరమైన దాడికి తామే బాధ్యులమని పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' ప్రకటించుకుంది.

మిగతా 2లో





# తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల

**ఫలితాలను విడుదల చేసిన డిప్యూటీ సీఎం భట్టి**

**ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో 66.89 శాతం ఉత్తీర్ణత**

**సెకండియర్‌లో 71.37 శాతం ఉత్తీర్ణత**

# ముగిసిన సిఎం రేవంత్ రెడ్డి పర్యటన

**నేడు హైదరాబాద్‌కు తిరిగి రాక**

హైదరాబాద్, ఏప్రిల్ 22,ఆంధ్ర ప్రగతి:తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం జపాన్ పర్యటన విజయవంతంగా ముగిసింది. ఈ పర్యటన ద్వారా రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు వచ్చాయి. ఇప్పటివరకు మొత్తం రూ. 12,062 కోట్ల విలువైన

మిగతా 2లో



# ప్రభుత్వ పెద్దల జేబులు నిండుతున్నాయి



**వైసీపీ పీఏసీ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వంపై జగన్ తీవ్ర విమర్శలు**

**కక్ష సాధింపు రాజకీయాలు, అవినీతి పెరిగిపోయాయని ఆరోపణ**

**విశాఖ భూములు, అమరావతి పనులపై ప్రభుత్వ నిర్ణయాలను తప్పుబట్టిన జగన్**

వెలగపూడి ఏప్రిల్ 22,ఆంధ్ర ప్రగతి: కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన వైసీపీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కక్ష సాధింపు రాజకీయాలు పెరిగిపోయాయని, వ్యవస్థలను దిగజార్చుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలలో పారదర్శకత లోపించిందని జగన్ విమర్శించారు. విశాఖపట్నంలో సుమారు రూ. 3 వేల కోట్ల విలువైన భూమిని ఎలాంటి గుర్తింపు లేని సంస్థకు కేవలం ఒక్క రూపాయికే కట్టబెట్టారని ఆయన ఆరోపించారు. అదేవిధంగా, లులూ గ్రూపునకు రూ. 2,000 కోట్ల విలువైన భూమిని అప్పగించారని మండిపడ్డారు. రాజధాని అమరావతిలో నిర్మాణ పనుల అంచనాలను భారీగా పెంచి, ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని అన్నారు.

మిగతా 2లో

**ఇంటలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్**

# ఆంజనేయులు అరెస్ట్




వెలగపూడి ,ఏప్రిల్ 22,ఆంధ్ర ప్రగతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంటలిజెన్స్ మాజీ చీఫ్, ఐఏఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్టు అయ్యారు. విజయవాడ పోలీసులు ఆయనను హైదరాబాదులో అదుపులోకి తీసుకొన్నారు. ముంబై నటి, మోడల్ కాందాంబరి జెత్వానీ కేసులో పోలీసులు ఆయనను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో పీఎస్ఆర్ ఆంజనేయులు ఎందుకు అరెస్టు చేయలేదని గతంలోనే హైకోర్టు ప్రశ్నించిన సంగతి తెలిసిందే.

మిగతా 2లో

# ముడుపులిచ్చే కంపెనీలకే ఆర్డర్లు..

**ప్రతినెలా ఐదో తేదీన 'కమీషన్ల' లెక్కలు**

**దోపిడీ 3,200 కోట్లు.. రిమాండ్ రిపోర్ట్‌లో వెల్లడి**

**కసిరెడ్డికి రిమాండ్.. విజయవాడ జైలుకు తరలింపు**



# యూపీఎస్సీ ఫలితాల్లో తెలుగు విద్యార్థుల సత్తా

**యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్-2024 తుది ఫలితాలు విడుదల**

**దేశవ్యాప్తంగా మొత్తం 1009 మంది అభ్యర్థులు ఎంపిక**

**తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు**

**ఇ. సాయి శివానికి 11వ ర్యాంక్, బన్నా వెంకటేశ్‌కు 15వ ర్యాంక్**




2లో

# సౌదీ పర్యటనకు భారత ప్రధాని మోడీ

**జెట్ ఫైటర్లతో స్వాగతించిన సౌదీ**

న్యూఢిల్లీ,ఏప్రిల్ 22,ఆంధ్ర ప్రగతి: ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం సౌదీ అరేబియా పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా అరుదైన సందర్భం చోటుచేసుకుంది. ఎన్నడూ లేనివిధంగా ఆ దేశం మోదీని ప్రత్యేకంగా స్వాగతించింది. మోదీ ప్రయాణిస్తున్న విమానం సౌదీ అరేబియా గగనతలంలోకి ప్రవేశించగానే.. రాయల్ సౌదీ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఎఫ్-15 విమానాలు దానిని అనుసరించి, సగౌరవంగా స్వాగతించాయి.



# యూపీఎస్సీ ఫలితాల్లో తెలుగు విద్యార్థుల సత్తా

(మొదటి పేజి తరువాయి)

దేశవ్యాప్తంగా లక్షలాది మంది అభ్యర్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీఎస్ఈ) 2024 తుది ఫలితాలు వెలువడ్డాయి. ఈ మేరకు యూపీఎస్సీ మంగళవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ ఫలితాల్లో 1,009 మందిని యూపీఎస్సీ ఎంపిక చేయగా, జనరల్ కేటగిరీలో 335 మంది, ఈడబ్ల్యూఎస్ నుంచి 109 మంది, ఓబీసీ నుంచి 318 మంది, ఎస్సీ కేటగిరీ నుంచి 160 మంది, ఎస్టీ కేటగిరీ నుంచి 87 మంది చొప్పున ఎంపికయ్యారు.కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్), ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) సహా 25కు పైగా సర్వీసుల్లోని వెయ్యికి పైగా పోస్టులు ఉన్నాయి.ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల అనంతరం మొత్తం 2,845 మంది అభ్యర్థులు తుది దశగా జరగనున్న ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియలో భాగంగా 2024 జూన్ 16న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించగా, జులై 1న ఫలితాలు వెలువడ్డాయి. అనంతరం సెప్టెంబర్ 20 నుంచి 29 వరకు మెయిన్స్ పరీక్షలు జరిగాయి. వాటి ఫలితాలను డిసెంబర్‌లో ప్రకటించారు. మెయిన్స్‌లో ఉత్తీర్ణులైన వారికి 2025 జనవరి 7 నుంచి ఏప్రిల్ 17 వరకు రెండు సెషన్లలో ఢిల్లీలో ఇంటర్వ్యూలు నిర్వహించి తాజాగా తుది ఫలితాలను ప్రకటించింది.ఈ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు తమ సత్తా చాటారు. సాయి శివాని 11వ ర్యాంకుతో సత్తా చాటారు. బన్నా వెంకటేశ్ 15వ ర్యాంకు, అభిషేక్ శర్మ 38వ ర్యాంకు, రావుల జయసింహారెడ్డి 46వ ర్యాంకు, శ్రవణ్ కుమార్ రెడ్డి 62వ ర్యాంకు, సాయి చౌతన్య జాదవ్ 68వ ర్యాంకు, ఎన్. చేతనరెడ్డి 110వ ర్యాంకు, చెన్నంరెడ్డి శివగణేష్ రెడ్డి 119వ ర్యాంకు సాధించారు.జాతీయస్థాయిలో టాప్ 10 ర్యాంకర్ల జాబితాను కూడా యూపీఎస్సీ ప్రకటించింది. వారిలో శక్తి దుబే, హర్షిత గోయెల్, డోంగ్రే అర్చిత్ పరాగ్, షా మార్గి చిరాగ్, ఆకాశ్ గార్గ్, కోమల్ పూనియా, ఆయుషి బన్సల్, రాజ్‌కృష్ణ ఝా, ఆదిత్య విక్రమ్ అగర్వాల్, మయాంక్ త్రిపాఠి ఉన్నారు.

# ప్రభుత్వ పెద్దల జేబులు నిండుతున్నాయి

(మొదటి పేజి తరువాయి)

గతంలో రూ. 36 వేల కోట్లుగా ఉన్న పనుల అంచనాలను, సిమెంట్, స్టీల్ ధరలు పెరిగాయనే సాకుతో ఇప్పుడు రూ. 77 వేల కోట్లకు పెంచారని జగన్ ఆరోపించారు. జ్యుడీషియల్ ప్రివ్యూ, రివర్స్ టెండరింగ్ వంటి పారదర్శక విధానాలను తొలగించి, మొబిలైజేషన్ అడ్వాన్సులను తిరిగి తీసుకురావడం ద్వారా దోపిడీకి ఆస్కారం కల్పిస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని, తమ ప్రభుత్వ హయాంలో పనిచేసిన అధికారులను లక్ష్యంగా చేసుకుంటున్నారని జగన్ విమర్శించారు. సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్టును ఆయన ఖండించారు. ఇది కక్ష సాధింపు రాజకీయాలకు పరాకాష్ఠ అని అన్నారు. ఎంపీ మిథున్ రెడ్డిని, పెద్దిరెడ్డి కుటుంబాన్ని కూడా లక్ష్యంగా చేసుకుని, లేనిపోని ఆరోపణలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కీలక సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి అరెస్టులు, ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన మద్యం విధానం విప్లవాత్మకమైనదని అన్నారు.గత ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ



పథకాలను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిందని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల అమలు ఏమైందని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీని పూర్తిగా పక్కనపెట్టారని, రూ. 3500 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాల కింద గత ఏడాది రూ. 3,900 కోట్లు బకాయి పెట్టారని, ఈ ఏడాది కూడా చెల్లింపులు జరగడం లేదని తెలిపారు. పెన్షన్ల సంఖ్యను తగ్గించారని, కొత్తగా ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదని ఆరోపించారు.

తాము గతంలో సంక్షేమ పథకాలకు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి డబ్బు జమ చేయడానికి బటన్ నొక్కామని, ఇప్పుడెందుకు అలా చేయడం లేదని జగన్ ప్రశ్నించారు. బటన్ నొక్కితే డబ్బులు నేరుగా ప్రజల ఖాతాల్లోకి వెళతాయని, మధ్యలో దోచుకోవడానికి ఏమీ ఉండదనే ఉద్దేశంతోనే చంద్రబాబు బటన్ నొక్కడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆదాయం తగ్గిపోతుండగా, ప్రభుత్వ పెద్దల జేబులు నిండుతున్నాయని ఆరోపించారు.

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పీఏసీ సభ్యులు క్రియాశీలక పాత్ర పోషించాలని జగన్ పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై, ప్రభుత్వ వైఫల్యాలను, అన్యాయాలను ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వైసీపీకి మీడియా బలం తక్కువగా ఉన్నందున... సోషల్ మీడియాను, ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్‌ను ఒక ఆయుధంగా వాడుకోవాలనే విషయంపై కార్యకర్తలకు అవగాహన కల్పించాలన్నారు. గతంలో కాంగ్రెస్‌ను వీడినప్పుడు కూడా ఇలాంటి దుష్ప్రచారాలు ఎదుర్కొన్నామని, అయినా ప్రజలు ఆశీర్వదించారని గుర్తుచేశారు. ఎన్ని కేసులు పెట్టినా, జైల్లో పెట్టినా ప్రజా వ్యతిరేకతను అణచివేయలేరని, ప్రజల అంతిమ తీర్పును ఎవరూ మార్చలేరని ధీమా వ్యక్తం చేశారు. కష్టకాలంలోనే నాయకులు ఎదుగుతారని, ప్రజల పక్షాన రాజీలేని పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు జగన్ దిశానిర్దేశం చేశారు.

# జమ్ముకశ్మీర్‌లో పర్యాటకులపై పాశవికం

(మొదటి పేజి తరువాయి)

జమ్ము కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలో ఉగ్రవాదులు మరోసారి పంజా విసిరారు. పర్యాటకులపై జరిగిన కాల్పుల ఘటనలో ఒకరు మృతి చెందగా, ఆరుగురు గాయపడినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. ఈ సంఘటనతో పహల్గాంలో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి.వివరాల్లోకి వెళితే, పహల్గాంలోని బైసరన్ వ్యాలీ ఎగువ ప్రాంతంలోని ఒక పర్యాటక రిసార్టు వద్ద ఈ దాడి జరిగింది. ఈ ప్రాంతానికి కేవలం కాలినడకన లేదా గుర్రాల ద్వారా మాత్రమే చేరుకునే వీలుంటుంది. ఇలాంటి ప్రాంతంలో పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. సైనిక తరహా దుస్తుల్లో వచ్చిన దుండగులు ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని పక్కా ప్రణాళికతోనే ఈ దాడికి పాల్పడి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు.

ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే భద్రతా బలగాలు, వైద్య బృందాలు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. గాయపడిన పర్యాటకులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని, దాడికి పాల్పడిన ఉగ్రవాదుల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి.

**ఉగ్రవాదులను వదిలే ప్రసక్తి లేదు**

**హోంమంత్రి అమిత్ షాకు మోడీ ఫోన్**

కాశ్మీర్ దాడి ఉగ్రవాదులను వదిలే ప్రసక్తి లేదు
హోంమంత్రి అమిత్ షాకు మోడీ ఫోన్



ఘటనను తీవ్రంగా ఖండించిన ప్రధాని, అమిత్ షా

న్యూఢిల్లీ,ఏప్రిల్22(ఆర్ఎన్ఎ): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యటకులపై జరిగిన ఉగ్ర దాడిని ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. సౌదీ పర్యటనలో ఉన్న ఆయన.. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడారు. దాడి ఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని సూచించిన ప్రధాని.. తక్షణమే ఘటనాస్థలానికి వెళ్లి పరిస్థితి సమీక్షించాలని చెప్పారు. జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదులు దుశ్చర్యకు పాల్పడ్డారు. అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గామ్‌లోని పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చిన టూరిస్టులపై కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో ఇప్పటి వరకు భారీగా ప్రాణ నష్టం వాటిల్లింది. అలాగే, అనేక మంది గాయపడ్డారు. ఈ ఘటనపై సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ ఆరా తీశారు. దాడి గురించిన వివరాలను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నుంచి అడిగి తెలుసుకున్నారు. సంఘటన స్థలాన్ని సందర్శించాల్సిందిగా అమిత్ షాకు ప్రధాని మోడీ ఆదేశించారు. ఘటనపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇక, ఎక్స్ వేదికగా స్పందించిన ప్రధాని మోడీ.. బైసరన్ లోయలోకి వెళ్లిన పర్యాటకులపై కాల్పులు జరిపిన ఉగ్రవాదులు తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని తెలిపారు. ఈ దాడికి పాల్పడిన వారిని ఎవరినీ కూడా వదిలి పెట్టమని హెచ్చరించారు. నిందితులను న్యాయస్థానం ముందు నిలబెడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ దాడుల్లో మరణించిన వారి కుటుంబాలకు ప్రధాన మంత్రి సంతాపాన్ని వ్యక్తం చేశారు. బాధితులకు సాధ్యమైనంత త్వరగా సహాయం అందిస్తామని ప్రధాని మోడీ చెప్పుకొచ్చారు. జమ్ము కాశ్మీర్ లో జరిగిన ఉగ్రదాడి తర్వాత కేంద్రమంత్రి అమిత్ షా తన ఇంట్లో ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ మీటింగ్ లో వర్చువల్ గా జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో పాటు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, పోలీసులు, పారామిలిటరీ భద్రతా సంస్థ, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సీనియర్ అధికారులు హాజరయ్యారు. బైసరన్ లోయలో జరిగిన ఉగ్ర దాడి గురించి కీలక అంశాలపై చర్చించారు. పర్యటకులపై దాడి తీవ్రంగా బాధించింది. ఇందులో పాల్గొన్న వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. నేరస్థులపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటాం. ఘటన గురించి ప్రధాని మోడీకి వివరించాను. సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించాను. అత్యవసర భద్రతా సమీక్ష కోసం శ్రీనగర్ వెళు_న్నానని కేంద్ర హోంశాఖ మత్రి అమిత్ షా ట్వీట్ చేశారు. పహల్గాంలో పర్యటకులపై ఉగ్రదాడిని జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ఖండించారు. దీనిని హేయమైన చర్యగా పేర్కొన్నారు. దాడికి పాల్పడినవారు మానవ మృగాలని, ఘటనను ఖండించేందుకు మాటలు రావడం లేదంటూ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

# ముడుపులిచ్చే కంపెనీలకే ఆర్డర్లు..

అమరావతి, ఏప్రిల్ 22,ఆంధ్ర ప్రగతి:

"జగన్ ఆదేశించారు. నేను ఆచరించాను. మిథున్ రెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి, విజయసాయి రెడ్డి, వాసుదేవరెడ్డి కలిసి మద్యం నుంచి ముడుపులు పిండుకునే పథకాన్ని రచించాం. జగన్ కార్యదర్శిగా ఉన్న ధనుంజయ్ రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డితోపాటు పలువురికి ఇందులో పాత్ర ఉంది" అని లిక్కర్ స్కామ్ సూత్రధారి రాజ్ కసిరెడ్డి అలియాస్ కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అంగీకరించినట్లు 'సిట్' వెల్లడించింది. రాజ్ కసిరెడ్డి రిమాండ్ రిపోర్టులో అనేక కీలక విషయాలు బయటపెట్టింది. ఇద్దరు మధ్యవర్తుల సమక్షంలో ఆయనను ప్రశ్నించామని... నేరం, దాని వెనుక ఉన్న కుట్ర, తన పాత్ర, ఇతరుల భాగ స్వామ్యంపై అన్ని అంశాలు అంగీకరించిన రాజ్ కసిరెడ్డి, చివరికి నేరాంగీకరపత్రంపై సంతకం చేసేందుకు నిరాకరించారని 'సిట్' పేర్కొంది. రిమాండ్ రిపోర్టులో ఏముందంటే...ప్రభుత్వానికి, పార్టీకి బాగా నిధులు వచ్చేలా మద్యం పాలసీపై వర్కవుట్ చేసే బాధ్యతను అప్పటి సీఎం జగన్ నాకు అప్పగించారు. ఈ పాలసీ ద్వారా పార్టీకి బాగా ఫండ్ రావాలని, పథకాల అమలుకూ ఆదాయం సమకూరాలని నిర్దేశించారు. దీంతో... బేవరేజెస్ కార్పొరేషనే లిక్కర్ షాపులు ఏర్పాటు చేసి మద్యం వ్యాపారం చేసేలా కొత్త పాలసీని రూపొందించాం. ఐఆర్‌టీఎస్ అధికారి వాసుదేవరెడ్డిని డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి తీసుకొచ్చి... తొలుత బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా, ఆ తర్వాత బేవరేజెస్, డిస్టిలరీస్ కమిషనర్‌గా నియమించారు. మద్యం అమ్మకాలు, కొనుగోళ్లు, లేబుల్ రిజిస్ట్రేషన్‌లు తదితర కార్యకలాపాలపై పూర్తి నియంత్రణ ఆయనకే దక్కేలా చూశారు. మద్యం వ్యాపారుల నుంచి ముడుపులు తీసుకునేందుకు రూపొందించిన మా ప్లాన్‌ను అమలు చేసే బాధ్యతను అసిస్టెంట్ సెక్రటరీగా ఉన్న సత్యప్రసాద్‌కు అప్పగించాం. 2023లో ఆయనకు సివిల్ సర్వీసు కోటాలో ఐఏఎస్ హోదా ఇప్పిస్తామని మాట ఇచ్చాం. మద్యం వ్యవహారంలో ప్రత్యేక అధికారిగా నియమించాం.మద్యం ముడుపుల కుట్రకు హైదరాబాద్‌లోని విజయసాయి రెడ్డి ఇంట్లోనే ప్లాన్ చేశాం. 2019 అక్టోబరు 13న విజయసాయి ఇంట్లోనే కీలక భేటీ జరిగింది. విజయ సాయిరెడ్డి, పి.మిథున్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, మద్యం ప్రత్యేక అధికారి సత్యప్రసాద్ భేటీ అయ్యాం. మద్యం ఉత్పత్తి దారులు, డిస్టిలరీస్ నుంచి నెలకు కనీసం 50–60 కోట్లు ముడుపులు వచ్చేలా స్కీమ్ రూపొందించాం. ఇందుకోసం తొలుత అబ్కారీ శాఖలో కీలకమైన సీ–టెల్ సాఫ్ట్‌వేర్‌ను తొలగించాలనుకున్నాం. ఇదే విషయాన్ని సత్యప్రసాద్‌కు చెప్పాం. సీ–టెల్ సాఫ్ట్‌వేర్‌లో మద్యం అమ్మకాలు, సరఫరా వివరాలన్నీ ఆటోమేటిక్‌గా జరిగిపోతుంటాయి. ఆయా బ్రాండ్ల మూడు నెలల అమ్మకాలు, దానిపై పది శాతం పెరుగుదలను కలిపి స్టాక్ ఇచ్చేలా ఆ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ఇది అమల్లో ఉంటే మా పథకం ఫలించదు.

## ఇంటలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్

# ఆంజనేయులు అరెస్ట్

(మొదటి పేజి తరువాయి)

తెలుగు రాష్ట్రాల్లో మొదటి సారిగా గతంలో ఇంటలిజెన్స్ చీఫ్ గా పనిచేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేయడం జరిగింది. బేగంపేటలోని ఆయన నివాసంలో ఏపీ సీఐడీ పోలీసులు నేటి ఉదయం ఆయనను అదుపులోకి తీసుకున్నారు

గత ప్రభుత్వ హయాంలో ఆంజనేయులు ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పని చేశారు. ప్రస్తుతం పీఎస్ఆర్ ఆంజనేయులు సస్పెన్షన్‌లో ఉన్నారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసం నుంచి పోలీసులు ఏపీకి తరలిస్తున్నారు. జెత్వానీ కేసులో పూర్తిస్థాయిలో సీఐడీ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులుని విచారించనున్నారు. నటి జెత్వానీ తప్పుడు ఆరోపణలపై అరెస్టు, వేధింపులకు పాల్పడినందుకు సస్పెండ్ చేయబడిన ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులలో ఆయన ఒకరు.

మరోవైపు ఇదే కేసులో సీనియర్ ఐపీఎస్ అధికారులు క్రాంతి రాణా టాటా, విశాల్ గున్నీ కూడా నిందుతులుగా ఉన్న సంగతి తెలిసిందే. అయితే వారిద్దరి హైకోర్టు ఇప్పటికే ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఆంజనేయులు మాత్రం ఇప్పటివరకూ బెయిల్ కోసం అప్పీల్ చేసుకోలేదు.

కాగా గత ఆగస్టులో ఎన్టీఆర్ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబుకు జెత్వానీ అధికారికంగా ఫిర్యాదు చేసింది. ఫిబ్రవరిలో తనపై ఫోర్జరీ, దోపిడీ కేసు నమోదు చేసిన రాజకీయ నేత, సినీ నిర్మాత కేవీఆర్ విద్యాసాగర్‌తో అధికారులు కుట్ర పన్నారని ఆరోపించారు. సీనియర్ పోలీసు అధికారులు విద్యాసాగర్‌తో కుమ్మక్కై తనను, తన కుటుంబాన్ని వేధించారని, ముందస్తు నోటీసు లేకుండా అరెస్టు చేశారని, ముంబై నుంచి విజయవాడకు తీసుకువచ్చారని జెత్వానీ ఆరోపించారు. తనను, తన తల్లిదండ్రులను తీవ్రంగా అవమానించారని, చట్టవిరుద్ధంగా నిర్బంధించారని 40 రోజులకు పైగా జ్యుడీషియల్ కస్టడీలో ఉంచినట్లు పేర్కొన్నారు

# బనకచర్లపై ప్రతిపాదనలు

(మొదటి పేజి తరువాయి)



ఖాళీ అయిన స్థానాలకు ఇద్దరు టీడీపీ నుంచి రాజ్యసభ సభ్యులుగా సానా సతీష్, బీద మస్తాన్ రావు ఎన్నిక కాగా, మూడవ స్థానాన్ని బీజేపీ.. ఆర్ కృష్ణయ్యతో భర్తీ చేసింది.. నాలుగవ స్థానాన్ని భర్తీ చేసే అంశంపై ఈ రోజు బీజేపీ అగ్రనేత, కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షాతో టీ–డీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు కీలక సమాలోచనలు చేశారు.. దీనిపై ఈరోజో..రేపో.. అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందంటున్నారు..ఏపీ సీఎం చంద్రబాబు మంగళవారం దిల్లీలో కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్‌పాటిల్‌తో భేటీ– అయ్యారు. పోలవరం, బనకచర్ల ప్రాజెక్టులపై చర్చించారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తెదేపా ఎంపీలు పాల్గొన్నారు. మే 2న ప్రధాని మోదీ అమరావతి రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లపై అమిత్‌షాతో చంద్రబాబు చర్చించారు.

# సౌదీ పర్యటనకు భారత ప్రధాని మోడీ

## జెట్ ఫైటర్లతో స్వాగతించిన సౌదీ

(మొదటి పేజి తరువాయి)



దీనికి సంబంధించిన వీడియోను విదేశాంగశాఖ షేర్ చేసింది. రెండు దేశాల మధ్య రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా అడుగులు పడతాయని ఈ ఆత్మీయ స్వాగతం చాటుతోంది. ప్రధాని రెండు రోజుల పర్యటనలో భాగంగా ఈ రోజు సౌదీ వెళ్లారు. ఇంధనం, వాణిజ్యం, రక్షణ వంటి పలు కీలక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడం లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది. మోదీ, సౌదీ అరేబియా యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్‌ల నడుమ ఇటీ–వల జరిగిన చర్చల తర్వాత ఇరుపక్షాల మధ్య పలు ఒప్పందాలు కుదిరాయి. భారత్, సౌదీ అరేబియాల మధ్య ఇప్పటికే బలమైన వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది. సౌదీ అరేబియా యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ జెడ్డాలో ల్యాండ్ అయ్యారు. దీనిపై ప్రధాని ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఈ పర్యటన రెండు దేశాల మధ్య స్నేహాన్ని మరింత బలోపేతం చేయనుంది. ఈ రోజు, రేపు పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఎదురుచూస్తున్నానుని చెప్పారు. మోదీ ఆ దేశానికి వెళ్లడం ఇది మూడోసారి కావడం విశేషం. ఇటీవల సౌదీతో మనబంధం బలోపేతం కావడంతో మోడీకి ఆదరణ పెరుగుతోంది.

# ముగిసిన సిఎం రేవంత్ రెడ్డి పర్యటన

పెట్టుబడులు, దాదాపు 30,500 ఉద్యోగాలు ఈ పర్యటన ద్వారా సాధ్యమయ్యాయి. మారుబెని కంపెనీ : హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ–లో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు మారుబెని కంపెనీతో ఒప్పందం కుదిరింది. ప్రారంభ పెట్టుబడి: ...1,000 కోట్లు, మొత్తం అంచనా పెట్టు–బడి: ...5,000 కోట్లు–ఉద్యోగాలు: 30,000. హైదరాబాద్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఒప్పందం. పెట్టు–బడి: ...10,500 కోట్లు. తోషిబా ట్రాన్స్ మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా : రుద్రారంలో విద్యుత్ పరికరాల తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఒప్పందం. పెట్టు–బడి: ...562 కోట్లు–జపాన్‌లో 500 ఉద్యోగ నియామకాలకు టామ్‌కామ్, టెర్న్, రాజ్ గ్రూప్ సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది.జపాన్ పర్యటన ముగించుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు. హైదరాబాద్ చేరుకున్న తర్వాత, నేరుగా సంగారెడ్డికి వెళ్లనున్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి కుమార్తె ఎంగేజ్‌మెంట్ కార్యక్రమంలో సీఎం హాజరుకానున్నారు.

# తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల

**ఫలితాలను విడుదల చేసిన డిప్యూటీ సీఎం భట్టి**

**ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో 66.89 శాతం ఉత్తీర్ణత**

**సెకండియర్‌లో 71.37 శాతం ఉత్తీర్ణత**

తెలంగాణ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఫలితాలను విడుదల చేశారు. ఇంటర్ ఫలితాల్లో బాలికలు సత్తాచాటారు. ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో 66.89 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలు 73.83 శాతం, బాలురు 57.83 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ పరీక్షలకు 4,88,430 మంది హాజరు కాగా 3,22,191 మంది ఉత్తీర్ణత సాధించారు.

సెకండియర్‌లో 71.37 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, బాలికలు 74.21 శాతం, బాలురు 57.31 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్ పరీక్షలకు 5,08,582 మంది హాజరు కాగా... 3,33,908 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫలితాల కోసం ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ %https://results.cgg.gov.in%/ లో చూడోచ్చు. విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబర్ ఎంటర్ చేసి, రిజల్ట్ చూసుకోవచ్చు. కాగా, మార్చి 5 నుంచి 25 వరకు 1,532 కేంద్రాల్లో ఇంటర్ వార్షిక పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఇంటర్ వార్షిక పరీక్షలకు మొత్తం 9.96 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు.

# ఓలా ఊబర్‌లను నిషేధించాలి

## సామాన్య కార్మికుల పొట్టకొడుతున్న సంస్థలు -విజయవాడలో ఆటోవాలాల భారీ నిరసన ప్రదర్శన




విజయవాడ,ఏప్రిల్ 22,ఆంధ్ర ప్రగతి:: ఓలా, ఉబర్, రాపిడో తదితర బడా కంపెనీల మోసపూరిత చర్యలపై ఆటో కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కార్మికుల గొంతు కోస్తూ బడా సంస్థలకు మద్దతు తెలపటం పట్ల విజయవాడలో భారీ నిరసన తెలిపారు. మంగళవారం విజయవాడ బిఆర్టిఎస్ రోడ్ లో సిఐటియు అనుబంధ సంస్థ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు భారీ ఆందోళన, ర్యాలీ చేపట్టారు. వందలాది ఆటోలను నిలిపివేసి నిరసన తెలిపారు. భాను నగర్ నుండి ఫుడ్ జంక్షన్ వరకు ప్రదర్శన జరిపారు. అనంతరం ఫుడ్ జంక్షన్ వద్ద సభ నిర్వహించారు. ఈ ఆందోళనలో సిఐటియు, యూనియన్ గౌరవాధ్యక్షులు డి. కాశీనాథ్, కార్యదర్శి కార్యదర్శి కే. దుర్గారావు తదితరులు మాట్లాడారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. బాబురావు ఆటో కార్మికుల ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బాబురావు, కాశీనాథ్, దుర్గారావు మాట్లాడుతూ... ఓలా, ఉబర్, రాపిడో తదితర బడా సంస్థలు యాప్ ల పేరుతో ఒకవైపున ప్రయాణికులను, మరోవైపున ఆటో కార్మికులను దోచుకుంటున్నాయన్నారు. పెట్రోలు, డీజిల్, సిఎన్జి గ్యాస్ రేట్లు-, ఇన్సూరెన్స్ ఇతర ఖర్చులు, భారీ పెనాల్టీలు పెరిగిపోయాయని, ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. బడా సంస్థలు పోటీ- పడుతూ ప్రయాణికులను ఆకర్షించడానికి మోసపూరితంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఎ÷-లాట్ ఫారం ఫీజు, కమిషన్లు పేరుతో ఆటో కార్మికుల శ్రమను దోచుకుంటు-న్నాయని, ఇష్టారాజ్యంగా కార్మికుల ఆదాయంలో కోత పెడుతున్నాయని తెలిపారు. ప్రయాణికులకు రాయితీలు ఇస్తున్నట్లు- మోసపూరిత ప్రకటనలు ఇస్తూ, మార్కెట్ మొత్తాన్ని కబళించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. తొలుత రాయితీలు ఇస్తున్నట్లు కనపడినా, భవిష్యత్తులో అటు- ప్రయాణికులను ఇటు కార్మికులను దోచుకుని బడా కంపెనీలు తమ ఖజానా నింపుకోవడానికి కుట్రలు పన్నుతున్నాయని ధ్వజమెత్తారు. ఎలాంటి చట్టాలు, నిబంధనలు పాటించకుండా ఈ సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా, ప్రభుత్వాలు, వివిధ ప్రభుత్వ శాఖలు ప్రేక్షకపాత్ర వహిస్తున్నాయన్నారు.

పైపెచ్చు బ్యాంకులు, ప్రభుత్వ ఆర్థిక సంస్థలు, ప్రభుత్వాలు ఈ బడా సంస్థలకు ఆర్థిక సహాయం అందిస్తున్నాయన్నారు. ఆటో కార్మికులకు మాత్రం మొండి చేయి చూపిస్తున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఉపాధి పేరుతో ఈ బడా కంపెనీలతో (రాపిడో) ఒప్పందాలు చేసుకోవటం శోచనీయమన్నారు. ప్రైవేటు కంపెనీలకు లాభాల కోసం ప్రభుత్వాలు ఒప్పందాలు చేసుకోవడం అధికార దుర్వినియోగం అవుతుందని అన్నారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడా సంస్థల యాప్ లను నిషేధించాలని కోరారు. గతంలో ప్రకటించినట్లు- కేంద్ర ప్రభుత్వం ఉచిత యాప్ ప్రవేశపెట్టాలన్నారు. రవాణా బడా సంస్థల అక్రమ చర్యలను నియంత్రించాలని, ప్రభుత్వం తగు చట్టాలు రూపొందించాలని అన్నారు. ప్రయాణికులకు, కార్మికులకు రక్షణ కల్పించాలని కోరారు. ఆటో, టాక్సీ, బైక్ టాక్సీ తదితర బడా సంస్థల యాప్ ల ద్వారా పనిచేస్తున్న కార్మికులకు ఎటు-వంటి రక్షణ లేదనీ, ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదనీ, వారి శ్రమను దోచుకుంటు-న్నాయని తెలిపారు. మరోవైపు ఈ సంస్థల యాప్ లో లేని ఆటో కార్మికులకు కిరాయిలు లేకుండా చేస్తున్నాయని, దీనితో యాప్ లలో ఉన్న కార్మికులు, లేని కార్మికులు, మరోవైపు ప్రయాణికులు అందరూ దోపిడీకి గురవుతున్నారని వివరించారు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఈ యాప్ ల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని, కార్మికులకు, ప్రయాణికులకు అండగా నిలవాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న బడా సంస్థలను ప్రోత్సహిస్తూ, ఆటో కార్మికులపై భారీ పెనాల్టీలు విధించడం అన్యాయమన్నారు. 100 రూపాయల ఫైన్ స్థానంలో వెయ్యి రూపాయలకు ఫైన్ పెంచడం దుర్మార్గమని మండిపడ్డారు. జీవో నెంబర్ 21 పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆటోలు, మోటార్ సైకిళ్ళు ,ఇతర వాహనాలపై భారీ పెనాల్టీలు విధించటం అన్యాయమని దుమ్మెత్తిపోశారు. ప్రభుత్వం పెనాల్టీ ల పేరుతో కొట్లాది రూపాయలు వసూలు చేసి ఖజానా నింపుకుంటు-న్నదని నిప్పులు చెరిగారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న బడా కంపెనీలకు వత్తాసు ఇస్తూ, ప్రోత్సాహాలిస్తున్నారనీ, వారితో ఒప్పందాలు చేసుకుంటు-న్నారని మరోసారి ఆరోపించారు. ఆటో కార్మికులందరికీ వాహన మిత్ర పథకం ద్వారా 10 వేల రూ.. కాకుండా 15 వేలకు సంక్షేమం పెంచుతామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, పది నెలలు గడిచినా నోరు మెదపటం లేదని అడిగారు. సంక్షేమ పథకం ద్వారా ఆర్థిక సహాయం చేయకపోగా పెనాల్టీలు, ఇతర రూపాల్లో కార్మికుల నుండే ప్రభుత్వం భారీగా వసూలు చేయటం గర్హనీయమన్నారు. తక్షణమే ఆటో కార్మికులందరికీ హామీ ఇచ్చిన విధంగా 15 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించాలన్నారు. 21 నెంబర్ జీవో రద్దు చేయాలనీ, పెనాల్టీలు ఆపాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణలో ఠారెత్తిస్తున్న ఎండలు

## 45 డిగ్రీలకు చేరుతుందని హెచ్చరిక

హైదరాబాద్,ఏప్రిల్ 22,ఆంధ్ర ప్రగతి::



తెలంగాణలో ఎండలు ముదురుతున్నాయి. వరుసగా ఎండల తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు ఠారెత్తిస్తున్నాయి. ఈ క్రమంలో వాతావరణ శాఖ పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లను జారీ చేసింది. ఈ నెల 23న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు రెడ్ అలర్ట్, ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, భూపాలపల్లి జిల్లాలకు ఆరెంజ్ జారీ చేసింది. ఈ నెల 24, 25 తేదీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు, ఉమ్మడి నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇవాళ, రేపు, ఎల్లుండి వడగాలులు వీచే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వృద్ధులు, పిల్లలు బయటకు రావొద్దని సూచించింది. రేపటు÷-నంచి 3 రోజుల పాటు- 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

# బరితెగించిన ఓ విద్యార్థిని

## టీచర్‌ను చెప్పుతో కొట్టిన వైనం



విశాఖపట్నం,ఏప్రిల్ 22,ఆంధ్ర ప్రగతి:కాలేజీ సమయంలో సెల్ ఫోన్‌ను వాడొద్దని లాగేసుకున్న లెక్చరర్‌ను ఓ విద్యార్థిని చెప్పుతో కొట్టింది. తన ఫోన్ లాగేసుకోవడానికి నువ్వెవరని అంటూ ఎదురుదాడి చేసింది. ఈ ఘటన భీమిలి పట్టణంలోని రఘు కాలేజీ జరిగింది. కాలేజీలో మొబైల్ ఫోన్లు విపరీతంగా వాడటం.. రీల్స్ చేస్తూ చదువులు అటకెక్కుతున్నాయి. ఈ క్రమంలోనే ఓ ఉపాధ్యాయురాలు.. విద్యార్థులను తీవ్రంగా మందలించింది. అయినా పిల్లల్లో మార్పు రాకపోవటంతో.. ఓ విద్యార్థిని సెల్ ఫోన్‌ను తీసుకున్నది. కాలేజీ అన్నాక కొన్ని కట్టుబాట్లు-.. కొంత క్రమ శిక్షణ అవసరం కదా.. ఆ ఉద్దేశంతోనే ఆ విద్యార్థిని మొబైల్ ఫోన్ తీసుకున్నది. ఈ విషయాన్ని ఓ విద్యార్థి చాలా చాలా సీరియస్‌గా తీసుకున్నది. క్లాస్ అయిపోయిన తర్వాత కాలేజీ క్యాంపస్ లోనే ఉన్న టీచర్ దగ్గరకు ఆవేశంగా వచ్చిన ఆ విద్యార్థిని.. నా మొబైల్ ఫోన్ ఇవ్వు అంటూ దబాయించింది. ఈ విషయంపైనే ఆ టీచర్ ఏదో చెప్పబోతుంటే.. తన కాలి చెప్పు తీసి బెదిరించింది.. అంతటితో ఆగలేదు.. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తన చెప్పుతో.. ఆ టీచర్ చెంప పగలగొట్టింది.. నువ్వు ఎవరు నా ఫోన్ తీసుకోవటానికి.. మా వాళ్లను ఎందుకు తిడుతున్నావ్ అంటూ గట్టిగట్టిగా అరుస్తూ టీచర్ ను చెప్పుతో కొట్టింది. ఈ విషయాన్ని గమనించిన చుట్టు-పక్కల ఉన్న టీచర్స్ ఆ అమ్మాయిని పట్టుకుని పక్కకు తీసుకెళ్లారు. టీచర్ అంటే భయం లేదు.. భక్తి అంతకన్నా లేదని తేలింది.

# ప్రజాస్వామ్యంలో పార్లమెంట్ సుప్రీమ్

## రాష్ట్రపతిని నిర్దేశించే అధికారం సుప్రీంకులేదు -తన వ్యాఖ్యలను సమర్థించుకున్న ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ,ఏప్రిల్ 22,ఆంధ్ర ప్రగతి:

చట్టాలు చేయడం, సమస్యలు చర్చించడం ద్వారా పార్లమెంట్ మన ప్రజాస్వామ్యంలో అత్యున్నతమైన సంస్థ అని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ అన్నారు. అన్నింటికీ

పార్లమెంటును మించినది ఏదీ లేదని.. పార్లమెంటే అత్యున్నతమైనదని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ అన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు రాష్ట్రాల గవర్నర్లు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను తొక్కిపెట్టడంపైన ఆగ్రహం వ్యక్తం చేసింది. గవర్నర్లు గానీ, రాష్ట్రపతి గానీ శాసనసభ ఆమోదించిన బిల్లులను నిర్దేశ గడువులోపే పరిశీలించి ఆమోదించాలని తీర్పునిచ్చింది. గవర్నర్ రాష్ట్రపతికి బిల్లులని పంపినా.. మూడు నెలలోపే ఆ బిల్లులను క్లియర్ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తమిళనాడుకు చెందిన బిల్లులపై సుప్రీంకోర్టు చేసిన కీలక వ్యాఖ్యలపై ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ స్పందించారు. పార్లమెంటే సుప్రీం అని..రాష్ట్రపతి విధులకు సంబంధించి ఆదేశాలు ఇచ్చే అధికారం న్యాయవ్యవస్థకు లేదని వ్యాఖ్యానించారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా విమర్శలపై మరోసారి ఆయన



స్పందించారు. తాను అన్న వ్యాఖ్యలకు కట్టు-బడి ఉన్నట్లు చెప్పుకొచ్చారు. మంగళవారం ఢిల్లీ యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమంలో జగదీప్ ధన్‌కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పుపై తాను చేసిన వ్యాఖ్యలపై వస్తున్న విమర్శలపై స్పందించారు. రాజ్యాంగ వ్యవస్థ ప్రకారం తాను మాట్లాడిన ప్రతి మాట.. అత్యున్నతమైన జాతి ప్రయోజనాలతో చేసిందే అని అన్నారు. పార్లమెంటే అత్యున్నతమైనది.. న్యాయవస్థ 'సూపర్ పార్లమెంట్' పాత్రను పోషించలేదు, కార్యనిర్వాహక వర్గంలోకి ప్రవేశించలేదు అని అన్నారు. ఈ మేరకు దేశ సర్వోన్నత న్యాయస్థానంపై ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టు కంటే పార్లమెంటే ఎక్కువ అని వ్యాఖ్యానించారు. రాజ్యాంగ పరమైన అంశాల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులే అల్టిమేట్ మాస్టర్స్ అని పేర్కొన్నారు. పార్లమెంట్ కంటే అత్యుత్తమమైంది ఉందని రాజ్యాంగంలో ఎక్కడా లేదన్నారు. పార్లమెంటే అన్నింటికీ సుప్రీం అని తేల్చి చెప్పారు. ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ సమయంలో ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగిందని గుర్తుచేశారు. ఇటీవల బిల్లుల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వివాదంగా మారింది. నిర్ణీత గడువులోగా రాష్ట్రపతి సమ్మతి తెలపాలని తీర్పు ఇచ్చింది. అంతేకాకుండా వక్ఫ్ చట్టం తదుపరి విచారణ వరకు వాయిదా వేసింది. ఈ నిర్ణయాలే అధికార పెద్దలకు కోపం పుట్టించింది. ఉప రాష్ట్రపతి దగ్గర నుంచి బీజేపీ నేతలంతా సుప్రీం ధర్మాసనంపై విరుచుకు పడుతున్నారు. సుప్రీంకోర్టే ఆదేశాలు ఇస్తే.. ఇక పార్లమెంట్ మూసేసుకోవడం బెటర్ అంటూ ధ్వజమెత్తారు. ఇక బీజేపీ నేతల వ్యాఖ్యలను కాంగ్రెస్ ఖండించింది. సుప్రీంకోర్టును బీజేపీ నేతలు బెదిరిస్తున్నారంటూ ఆరోపించారు.

# కార్పొరేట్ కాలేజీల ప్రకటనల్లో స్టార్లు

## అల్లు అర్జున్, శ్రీలీలలపై విద్యార్థి సంఘాల ఆగ్రహం



విజయవాడ,ఏప్రిల్ 22,ఆంధ్ర ప్రగతి: ఇటీవల ఐఐటి ,జేఈఈ ఫలితాలు వచ్చాయి. ఈ సందర్భంగా కార్పొరేట్ కాలేజీలు స్టార్స్ తో ప్రకటనలను గుప్పించడంపై వామపక్ష విద్యార్థి విభాగం ఎ.ఐ.ఎస్.ఎఫ్. మండిపడింది. అయ్యింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ హీరోయిన్ శ్రీలీలపై ఫైర్ అయ్యింది. ఎందుకంటే వీరిద్దరూ కార్పొరేట్ కాలేజీలకు బ్రాండ్ అంబాసిడర్స్ వ్యవహరిస్తున్నారు. అయితే... వారు ఏ కాలేజీలను ప్రమోట్ చేస్తున్నారో... ఆ యా విద్యాసంస్థలు తప్పుడు ప్రకటనలు చేస్తున్నాయని ఎ.ఐ.ఎస్.ఎఫ్. ఆరోపించింది. బెట్టింగ్ యాప్స్ ను ప్రమోట్ చేసిన నటీనటులపై కేసులు పెట్టినట్టుగానే వీరిపైన కూడా క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేసింది. కాలేజీలు, వాటి యాజమాన్యం చేసే దారుణాలను పట్టించుకోకుండా కేవలం కోట్ల పారితోషికానికి ఆశపడి ఇలాంటి ప్రకటనలు చేయడం తగదని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ విజయవాడ సిటీ కౌన్సిల్ తెలిపింది. సహజంగా స్టార్స్ కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రమోట్ చేస్తే... అక్కడ విద్యా, వసతి సౌకర్యాలు బాగుంటాయని విద్యార్థులు భావిస్తారని, కానీ కాలేజీలో చేరిన విద్యార్థుల జీవితాలతో ఆ యా సంస్థలు ఆడుకుంటున్నాయని వాపోయింది. వీరు నటించే యాడ్స్ కారణంగా విద్యార్థుల జీవితాలు నాశనం అవుతున్నాయని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం అల్లు అర్జున్, శ్రీలీలపై చర్యలు తీసుకోవాలని ఎ.ఐ.ఎస్.ఎఫ్. డిమాండ్ చేసింది. కార్పొరేట్ కాలేజీలు ప్రభుత్వ నిబంధనలకు నీళ్ళు వదిలి, లక్షలు ఆర్జించడమే పరమావధిగా వ్యవహరిస్తున్నారు. లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ, లక్షలాది మంది విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వారి నిర్వహిస్తున్న హాస్టల్స్ లో కనీస వసతులు కూడా ఉండకపోవడంతో విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఎ.ఐ.ఎస్.ఎఫ్. పేర్కొంది. ఇలాంటి కార్పొరేట్ కళాశాల అకృత్యాలను వాటి బ్రాండ్ అంబాసిడర్స్ గా వ్యవహరించే నటీనటులు గమనించాలని, చాలా కాలేజీలు ఎక్కడో నార్త్ లో వచ్చిన ర్యాంకులను తమ విద్యా సంస్థలకు వచ్చినట్టుగా చూపిస్తున్నారని, వీటి నిజానిజాల నిగ్గు తేల్చాల్సి ఉందని వారు డిమాండ్ చేశారు.

# విశాఖ చుట్టూ భూములపై కన్ను

## అధికార పార్టీ నేతలే అసలు గద్దలు

విశాఖపట్టణంఏప్రిల్ 22,ఆంధ్ర ప్రగతి:

వైకాపాను అదేపనిగా నిగ్గదీసి, విమర్శించిన అధికార కూటమి ఇప్పుడు విశాఖను అప్పనంగా మింగాలని చూస్తోంది. భోగాపురం ఎయిర్‌పోర్టుతో పాటు, ఐటి బూచి చూపి చుట్టుపక్కల భూములను కాజేయాలని అధికార టిడిపి నేతలు చూస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. విశాఖ జిల్లాలో 'ల్యాండ్ పూలింగ్' పక్రియ మళ్లీ మొదలైంది. భీమిలి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని ఆనందపురం మండలం రామవరం, గంగసాని అగ్రహారంలలో రూ.వేల కోట్ల విలువైన 245 ఎకరాలను కాజేసేందుకు టిడిపి కీలక ప్రజాప్రతినిధి స్కెచ్ సిద్ధం చేశారు. ఈ భూములను తన అనుయాయులైన పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టి ఆర్థిక లబ్ధి పొందాలని చూస్తున్నారు. తన వ్యూహం పక్కాగా పారేందుకు విశాఖ అర్బన్ మెట్రోపొలిటన్ రీజియన్ అథారిటీ విఎంఆర్‌డిఎని తెరపైకి తెచ్చి నేరుగా రంగంలోకి దిగారు. 2014-2019 మధ్యకాలంలో టిడిపి ప్రభుత్వం అమరావతిపై అధిక కేంద్రీకరణ చేయడంతో ఈ పనులు ఆగిపోయాయి. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ఈ పక్రియ ముందుకు సాగలేదు. నేడు టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో భూసమీకరణ మళ్లీ ప్రారంభమైంది. ఈ నియోజకవర్గానికి చెందిన కీలక ప్రజాప్రతినిధి గతంలో ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరించిన రైతులతో నేరుగా చర్చలు జరుపుతున్నారు. విఎంఆర్‌డిఎ అధికారులూ వచ్చారని, గతంలో చెప్పిన విధంగా ఎ÷-లాట్లు- ఇస్తామని చెబుతున్నారని రైతులు తెలిపారు. తొమ్మిదేళ్ల క్రితం అప్పటి టిడిపి ప్రభుత్వం ఈ గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ పక్రియ ప్రారంభించింది. 2016 అక్టోబర్ 14న జిఒ నంబర్ 290ని తీసుకొచ్చింది. భూములను ప్లాట్లుగా మార్చి రైతులకు ఎకరాకు 900 గజాలు



విఎంఆర్‌డిఎ ద్వారా అభివృద్ధి చేసి ఇస్తామని ప్రకటించింది. అనందపుర మండలంలోని గంగసాని అగ్రహారం సర్వే 1, 2 నెంబరులో 135 ఎకరాలు, రామవరం సర్వే నెంబరు 121లో 110 ఎకరాలు చొప్పున సమీకరించేందుకు సిద్ధమైంది. ఈ భూములు 170 మంది రైతుల సాగులో ఉన్నాయి. శొంఠ్యాం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో, కనమాం-గోరంట మధ్య రోడ్డుకు అనుకొని ఉన్న ఈ ప్రాంతంలో ఎకరా భూమి కోట్ల రూపాయల్లో ఉంది. అప్పట్లో రాజకీయ దళారులు రంగ ప్రవేశం చేసి ఈ భూములకు ఎకరాకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ కొందరి రైతులకు అడ్వాన్స్‌లు ఇచ్చారు. జీడి, మామిడి తోటలు ఉన్న ఈ భూములను చదును చేసినా ప్లాట్లు వేసే పక్రియ ప్రారంభం కాలేదు. అప్పట్లో భూసమీకరణకు అంగీకరించినందున మరో ఆరు నెలల్లో రైతులకు ఎకరాకు 900 గజాల చొప్పున ఎ÷-లాట్లు- ఇస్తామని, ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పడేలా విఎంఆర్‌డిఎ చర్యలు తీసుకుంటు-ందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెబుతున్నారు. మాదాపూర్, గచ్చిబౌలి తరహాలో ఇక్కడికి ఐటి కంపెనీలు రాబోతున్నాయని ఊదరగొడుతున్నారు. గతంలో టిడిపి ఆధ్వర్యంలో ఎంవిపి కాలనీ లే అవుట్, మిథిలాపురి కాలనీ లే అవుట్లు- రూపుదిద్దుకున్నాయని, ఇదే తరహాలో గంగసాని అగ్రహారం, రామవరం అభివృద్ధి చెందనున్నాయని ఈ నెల పదిన ఈ గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్‌విశ్వనాథన్, ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ రైతులకు చెప్పుకొచ్చారు. ల్యాండ్ పూలింగ్ కింద తీసుకోనున్న భూముల్లో ఎమ్మెల్యే గంటా భూమి పూజ చేశారు. దీనిలో విఎంఆర్‌డి అధికారులు కూడా పాల్గొన్నారు. మొత్తానికి మళ్లీ భూముల కాజేతకు రంగం సిద్ధం అయ్యిందన్న ప్రచారం సాగుతోంది.

## ఎల్లమ్మేశ్వరి దేవస్థానం నందు అన్నదాన కార్యక్రమం.



**ఆంధ్ర ప్రగతిడోన్ ఏప్రిల్ 22:** చైత్ర శుద్ధ దశమి నీ పురస్కరించుకుని కొండపేటలో వెలిసిన రేణుక ఎల్లమ్మేశ్వరి దేవస్థానము నందు అన్న ప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది.ఆలయ ధర్మకర్తల మండలి ప్రధాన కార్యదర్శి ఏఈ నాగరాజు గౌడ్ తెలియజేశారు.బుధవారం రోజు భక్తులు దాతల ఆర్థిక సౌజన్యంతోమంగళవారం రోజు పత్రికా విలేకరుల సమావేశంలో ఏఈ నాగరాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ దశమి రోజు అన్న ప్రసాద కార్యక్రమాలు గత 18 సంవత్సరాల నుండి ఏర్పాటు చేస్తున్నామని అందులో భాగంగా నేడు బుధవారం రోజు అన్నదాన ప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నామని అదేవిధంగా శ్రీ రామచంద్ర మాలిక్ బాబా భజన మండలి అధ్యక్షులు ఉల్లిగడ్డల గురు ప్రసాద్ రాయల్ మరియు దేవస్థాన హార్మోనిస్టు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో అఖండ భజన కార్యక్రమం నిర్వహిస్తామనిసంస్థానం భజన మండలి వారు తెలియజేశారు రాత్రి 8 గంటలకు వడ్డే సుజాతఆధ్వర్యంలో 1000 8 దీప్ప పిండి ప్రమిదనిమ్మ జ్యోతులను అమ్మవారు స్వామివారి చిత్రలేఖన పై దీపక్ జ్యోతులను వెలిగిస్తామనివృద్ధులకు అమ్మవారి చీరలను అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సేవ మండలి కార్యకర్తలుకలసట్ల మంగలి రంగన్న మేకల రంగనాథ్ కటిక సురేష్ రావు మంగలి రామ్మోహన్ చాముండేశ్వరి సూర్య పద్మావతి వనం లక్ష్మీదేవి వడ్డే జ్యోతి మాధవి లతా బీసీ సంక్షేమ సంఘం డోన్ తాలూకా కన్వీనర్ జయ మనోజ్ వంటల కాంట్రాక్టర్ వడ్డే మద్దిలేటి ఆధ్వర్యంలో వంటల తయారీ కార్యక్రమం చేపడుతున్నారు.

## తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించిన నంద్యాల రత్నం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఏప్రిల్ 22:** తెలంగాణ రాష్ట్ర ఇంటర్ రెండవ సంవత్సరం ఫలితాల్లో 1000 కి 993 మార్కులతో తమ కుమార్తె పోలేపల్లి లక్ష్మి సహస్ర రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించినట్టు వారి తండ్రి పోలేపల్లి సుధీర్ ఒక ప్రకటన లో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కుమార్తె గతంలో బాలాజీ కాంప్లెక్స్ కేశవ రెడ్డి స్కూల్ లో పదవ తరగతి నంద్యాల టాపర్ గా నిలిచినట్టు గుర్తు చేశారు. లక్ష్మీ సహస్ర మాట్లాడుతూ తనకు సహకరించిన అధ్యాపక బృందానికి , ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ఐ.ఐ.టి లో ప్రవేశానికి కసరత్తు చేస్తున్నానని తెలిపారు.

## మెగా డీఎస్సీ వయోపరిమితి 44 నుంచి 47 సం"రాలకు పెంచాలి.

### -డీఎస్సీ పరీక్ష కాలవ్యవధిని 90 రోజులకు పెంచాలి.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 22:** ఏఐవైఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలఫలితంగా , రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులను ఐక్యం చేసి అనేక పోరాటాలు చేయడం ద్వారానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల సాధ్యమైందని , రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ ను అఖిల భారత యువజన సమాఖ్య గా స్వాగతిస్తున్నామని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జి నాగరాముడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటిఫికేషన్ కు సంబంధించి భవిష్యత్తులో అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. రాష్ట్రంలో 27 వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా 16,347 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులకు తీవ్ర నిరాశకు గురిచేసింది అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో స్పెషల్ డీఎస్సీ గురించి రాష్ట్ర ప్రభుత్వం వాటి ఊసే ఎత్తడం లేదని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు దృష్టి సారించాలని కోరారు. జిల్లాకు ఒకే పేపర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గత ఆరు సంవత్సరాల్లో నోటిఫికేషన్ విడుదల కాలేదని అభ్యర్థుల భవిష్యత్తు ను దృష్టిలో ఉంచుకొని వయోపరిమితి 47 సంవత్సరాలకు పెంచాలని కోరారు. రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు పై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. అదేవిధంగా పిఈటి పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. పరీక్ష గడువు తక్కువ కాలం ఉండటం వలన అభ్యర్థుల ఆందోళన చెందుతున్నారని కనీసం 70 రోజుల నుంచి 90 రోజుల వరకు సమయం ఇవ్వాలని కోరారు. భవిష్యత్తులో నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ మరింత పోరాటానికి శ్రీకారం చుడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రవి, విష్ణు, పాములేటి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీమద్రామాయణం భారతీయ సంస్కృతిలో ముఖ్యమైన భాగం.

### -డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే.



**ఆంధ్ర ప్రగతి నందికొట్కూరు ఏప్రిల్ 22:** శ్రీమద్రామాయణం కేవలం ఒక ఇతిహాస గ్రంథం మాత్రమే కాదు, ఒక సామాజిక, రాజకీయ మరియు సాంస్కృతిక గ్రంథం కూడా అని, ఇది భారతీయ సంస్కృతిలో ఒక ముఖ్యమైన భాగం ప్రపంచంలోని అన్ని వర్గాల ప్రజలను ప్రభావితం చేసినది, చేస్తూనే ఉంటుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణం, కోటవీధిలోని శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం నందు ప్రారంభమైన ధార్మిక కార్యక్రమాల ప్రారంభోత్సవ సందర్భంగా వారు ప్రారంభోపన్యాసం చేశారు. తదనంతరం వి. నాగేశ్వర రెడ్డి చేసిన ధార్మిక ప్రవచనం భక్తులను అలరించినది. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచార మండలి సభ్యులు అంబటి శివశంకర్ రెడ్డి, అర్చకులు గురు బసయ్య, మంజునాథ, ఆలయ కమిటీ అధ్యక్షులు సాపూరు శంకరప్ప, మహిళా మండలి అధ్యక్షులు, పార్వతమ్మ , మహిళా మండలి వ్యవస్థాపక అధ్యక్షులు కాళ్లూరు లక్ష్మి, ఉపాధ్యక్షులు వరలక్ష్మి, సోమిశెట్టి లత, శెట్టి గిరిజ, శెట్టి రేణుక, రాధా, మల్లేశ్వరమ్మ, అనూష, సౌజన్య, జగదీశ్వరి, సతీదేవి, రజిని, సుగుణ, సాపూరి సుధాకర్, గంగప్ప, కాళ్ళూరి శివప్రసాద్, శెట్టి పెద్ద వీరన్న, సాంబశివప్ప, శెట్టి విజయశంకర్, శెట్టి సుధాకర్, శెట్టి రవీంద్ర ప్రసాద్, సపూరి రవికుమార్, భాగవత సమాజం సభ్యులు జయరాం రెడ్డి, పెద్ద నాగలక్ష్మయ్య, ఎల్. రామ లక్ష్మయ్యతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.!

-రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.

-అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ లు ఇవ్వాలి.

-ఏపీయూడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 22:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. నంద్యాల జిల్లా ఏపీయూడబ్ల్యూజె జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ రామకృష్ణ పిజి కాలేజీ ఆడిటోరియం నందు మంత్రి ఫరూక్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలను వివరించారు. మంత్రి ఫరూక్ జర్నలిస్టుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. జర్నలిస్టులు పేదవారని, వారికి ఇంటి స్థలాలతో పాటు అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇచ్చేందుకు, జర్నలిస్టులకు ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, హెల్త్ కార్డులను మంజూరు చేయాలని కోరారు.
అనంతరం మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ



జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని, నంద్యాలలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలతోపాటు ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసేందుకు తగిన స్థలాన్ని కేటాయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఏపీయుడబ్ల్యూజె రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్యాం సుందర్ లాల్ మాట్లాడుతూ నంద్యాల జర్నలిస్టులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని, జర్నలిస్టులకు ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు స్థలం ఇవ్వాలని మంత్రి ఫరూక్ ను కోరారు. స్థలం కేటాయిస్తే తన వంతుగా ప్రెస్ క్లబ్ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయల విరాళాన్ని ఆయన ప్రకటించారు. అనంతరం మంత్రి ఫరూక్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుబాబు, ఉస్మాన్ భాష, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చలంబాబు, సీనియర్ పాత్రికేయులు జనార్ధన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి,ఏపీయూడబ్ల్యూజే కర్నూలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాస గౌడ్, ఐజెయు నాయకులు నాగరాజు, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజశేఖర్, మద్దిలేటి, పాత్రికేయులు, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా జిల్లా కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతనంగా ఎంపికైన రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్యాంసుందర్ లాల్, వాసు, నాగేంద్ర, సుబ్బయ్య లను రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు సన్మానించారు.

## చలమ రేంజ్ లో వన్యప్రాణులకు రక్షణ కరువు.



**ఆంధ్ర ప్రగతి మహానంది ఏప్రిల్ 22:** చలమ రేంజిలో వన్యప్రాణులకు రక్షణ కరువైనట్లు తెలుస్తుంది. గాజులపల్లె ,బసాపురం, పచ్చర్ల తదితర అటవీ సమీప గ్రామాల నుంచి కొందరు వేటగాళ్లు అటవీ ప్రాంతంలోనికి ప్రవేశించి వన్యప్రాణులను వేటాడుతున్నట్లు సమాచారం. ఇటీవల బసాపురం సమీపంలోని అటవీ ప్రాంతంలో 2 వన్యప్రాణులను వేటాడి వధించిన అనంతరం వాటి మాంసాన్ని విక్రయించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వన్య మృగాలు వేసవి కావడంతో నీటి కోసం నీటి కుంటల వైపు రావడం సహజం. దీనిని ఆసరాగా చేసుకుని వేటగాళ్లు వన్నె మృగాలను ఉచ్చులు మరియు ఇతర మార్గాల ద్వారా వేటాడి వధించి మాంస విక్రయాలు యదేచ్ఛగా కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. దీనికంతటికి అటవీ శాఖలో పనిచేసే ఒక స్థాయి ఉద్యోగి మామూళ్ల మత్తులో పడి వేటగాళ్లకు వత్తాసు పలుకుతూ వారిని తమ వెంట వేసుకొని కాపాడుతున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. అటవీ శాఖలో పనిచేసే ఆ స్వామికి ముడుపులు చెల్లిస్తే అటవీ ప్రాంతంలో ఎలాంటి పని అయినా చేసుకొని వెళ్లడానికి అనుమతి ఉంటుంది అనే ప్రచారం ముమ్మరంగా సాగుతున్నట్లు తెలుస్తుంది. ఆ స్వామి అనుమతి లేకుండా అటవీ ప్రాంతంలోకి ప్రవేశిస్తే కేసులు నమోదు చేయించి వేధిస్తారు అనే విమర్శలు వినవస్తున్నాయి. వెదురు ఇతర కలప తో పాటు వన్యప్రాణుల వేట వరకు అన్ని ఆ స్వామి కనుసనల్లోనే జరుగుతున్నాయని ఆరోపణలు ,విమర్శలు వెల్లువెత్తుతున్న అటవీశాఖ ఉన్నత స్థాయి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యం ఏమిటని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చలమ రేంజిలో నిరంతరం అక్రమ కలప రవాణా, వన్యప్రాణుల వేట జరుగుతున్న అటవీ శాఖ వర్గాలు నిమ్మకు నీరెక్కినట్లు వ్యవహరిస్తున్నారు అనేది నిర్వివాదాంశంగా మారినట్లు తెలుస్తుంది. వన్యప్రాణుల వేటకు నాటు తుపాకులు కూడా వేటగాళ్లు ఉపయోగిస్తున్నట్లు ప్రచారం ముమ్మరంగా సాగుతున్నట్లు తెలుస్తుంది. ఆ స్వామి కరుణాకటాక్షాలతో ఇదంతా జరుగుతున్నట్టు ప్రచారం. ఇటీవల బసాపురం సమీపంలోని అటవీ ప్రాంతంలో రెండు వన్య మృగాలను వేటాడిన అనంతరం వాటి మాంసాన్ని తీసుకొని పోయి విక్రయించారని, కానీ వాటి చర్మాన్ని అక్కడే వదిలేసి పోయారు అనే అంశం చర్చనీయాంశంగా మారినట్లు తెలుస్తుంది. ఆ స్వామి కరుణ కటాక్షం ఉన్నాయి కాబట్టే అక్కడ వదిలేసిన వన్యప్రాణి చర్మం అంశం బయటికి పొక్కకుండా జాగ్రత్త పడినట్లు తెలుస్తుంది. అటవీ శాఖ గస్తీ... కుస్తీగా మారిందా లేక కులాసాగా చూస్తూ తమ జేబులు నింపుకొని తమ కడుపులు నిండాయని భావించి వన్నె మృగాల కడుపులు చీల్చి వాటి మాంసాన్ని క్రయ,విక్రయాలకు పాల్పడిన చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

## లోకేశ్వర్ కన్స్ట్రక్షన్ పేరు గల వ్యక్తి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 22:** నంద్యాల ఎన్జీవోస్ కాలనీకి చెందిన దుర్గాప్రసాద్ అనే వ్యక్తి లోకేశ్వర్ కన్స్ట్రక్షన్ అనే పేరు పెట్టుకుని విద్యుత్ సంస్థలో ఆపరేటర్ క్లర్క్ పోస్టులు ఇప్పిస్తానని ఒక్కొక్క పోస్టుకు ఐదు లక్షల నుంచి 10 లక్షల వరకు వసూలు చేస్తూ ఉన్నాడు. ఇప్పటికే రాయలసీమ జిల్లాలో అనేకమంది ఇతని బారిన పడ్డారు డబ్బులు తీసుకోవడమే కాకుండా ఎవరైనా ఉద్యోగం రాలేదని ఉద్యోగం ఎప్పుడొస్తాదని అడిగితే ఇతరుల ద్వారా బెదిరించడం, అంతేకాకుండా పరుష పదజాలంతో దూషించడం జరుగుతున్నది. దీనిపైన ఒక ప్రజానాయకుడిగా ప్రశ్నించినందుకు పులికొండ అన్న అనే నాపైన మాట్లాడుతూ నేను పంచాయతీలు చేసి డబ్బులు తీసుకుంటున్నానని, సోషల్ మీడియాలో ప్రచారం చేయడం జరుగుతుంది. అనేకచోట్ల నేను తన బంధువునని చెప్పి కూడా వసూలు చేశాడు ఇది తప్పు అని అడగటానికి వెళితే పరుష పదజాలంతో దూషిస్తూ మీదికి రావడం జరిగింది. ఇటువంటి వ్యక్తి లక్షల రూపాయలు వసూలు చేస్తున్న ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్లో ఉన్నటువంటి ఎస్సీ గానీ, డి ఈ గాని, ఏఈలు గాని ఇంతవరకు ఖండించలేదు. దీని మతల బెయింటిదో ప్రజలకు ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ వారు చెప్పవలసినటువంటి అవసరం ఉంది. అసలు ఈ దుర్గాప్రసాద్ అనే వ్యక్తి ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్లో ఏమి పని చేస్తాడు ఉద్యోగాలు ఏ విధంగా కల్పిస్తాడు అనేది ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థ సమాధానం చెప్పాలని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రశ్నిస్తున్నాను. చీటింగ్ చేసి డబ్బులు వసూలు చేస్తున్న అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు. డబ్బులు ఇచ్చిన వారికి గట్టిగా అడిగితే చెక్కులు రాసిచ్చి చెక్కు బౌన్స్ అయిన కేసులు పెట్టినా పట్టించుకునే నాధుడు కరువయ్యాడు. ఈ విధంగా చీటర్లను వదిలిపెడితే పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని అప్పు చేసి తీసుకొచ్చి కట్టిన డబ్బులకు వడ్డీలు కట్టలేక ఇళ్ల చుట్టూ తిరుగుతున్న మళ్లీ వారిని బెదిరిస్తున్నాడు,అంటే ప్రజలు అర్థం చేసుకోవాలి. కాబట్టి ఇప్పటికైనా పోలీస్ యంత్రాంగం కానీ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ కానీ అతని పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తీసుకోకపోతే ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ముందు కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా చేయవలసి వస్తుందని తెలియజేస్తా. కొంతమంది మిత్రులు ఇటువంటి చీటర్లకు వత్తాసు పలుకుతూ కమీషన్ తీసుకుంటున్నట్టుగా బయట చర్చ జరుగుతోంది. అలాంటి వ్యక్తులు ఇలాంటి తప్పుడు వ్యక్తులకు మద్దతు ఇచ్చి మీ పేరును నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తా ఉన్నాం.
ఈకార్యక్రమంలో ఎం వి ఆర్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు బోయ పులికొండన్న,జయరామ్, కాశన్న, స్వామినాయుడు, గౌరీ, శంకర్, పరమేష్, బైరేష్, శివ, మహిళా నాయకురాలు పెద్దక్క, నాగమణి, సావిత్రి, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
బుధవారం 23 ఏప్రిల్ 2025

# పల్లెనిద్ర కార్యక్రమంలో విస్తృత అవగాహన కల్పించాలి.

**-మహిళలపై/చిన్నారులపై జరిగే నేరాలపై ప్రత్యక దృష్టి ఉంచి అవసరమైతే షీట్స్ ఓపెన్ చెయ్యాలి.**

**-జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ ఏప్రిల్ 22:** నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా నంద్యాల జిల్లాలోని బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఆళ్లగడ్డ పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ జిల్లాలో నేర నియంత్రణ కొరకు తీసుకోవలసిన చర్యలపై ప్రాధాన్యత క్రమంలో వివరించడం జరిగింది. ఈ సమావేశం నందు పెండింగ్ కేసులు వాటి స్థితిగతులను క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ సిస్టమ్ నందు అప్లోడ్ చేసిన వాటి ఆధారంగా సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం నమోదైన కేసుల్లో నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు వాటి వివరాలు మరియు పురోగతిపై ఆరా తీసి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి , నేరాల నియంత్రణతో పాటు నేరస్థులను పట్టుకోవాలని జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు. పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా సీసీ ఎన్ టి ఎస్ లో ఎప్పటికప్పుడు పొందుపర్చాలన్నారు. అన్ని వివరాలు నమోదు చేయడం వల్ల కేసులు, వ్యక్తుల పూర్తి సమాచారం తెలుస్తుందని అది అందరికీ ఉపయోగపడేలా దోహదం చేస్తుందన్నారు.

గ్రేవ్ కేసులు, యు ఐ కేసులు, పి టి కేసులు , మర్డర్ , సైబర్ క్రైమ్ కేసులు, పోక్సో కేసులు , మిస్సింగ్ కేసులు, ఎస్సీ ఎస్టీ కేసులపై ఆరా తీస్తూ వాటి దర్యాప్తు పురోగతిపై ప్రత్యక దృష్టి ఉంచాలని నేరం చేసిన వారికి శిక్ష పడేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలి. మిస్సింగ్ కేసుల విషయాలలో (బాలురు/బాలికలు) త్వరితగతిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వారి యొక్క ఆచూకీ తెలుసుకొని వారి యొక్క తల్లిదండ్రులకు అప్పగించాలి. మిస్సింగ్ కేసులు, అన్ ఐడెంటిఫైడ్ డెత్ బాడీ కేసులో క్రిమినల్ ఇంటిలిజెన్స్ సిస్టం అప్లికేషన్ లో ఎప్పటికప్పుడు చెక్ చేసుకుని కేసులలో పురోగతి సాధించాలి. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలి ఎన్ డి పి ఎస్ మరియు పోక్సో కేసులలో నిందితులపై నిఘా ఉంచాలి. అవసరమైతే రౌడీ షీట్ ఓపెన్ చేసేలా చర్యలు తీసుకోవాలి. రహదారి ప్రమాదాల నివారణ కొరకు తీసుకోవలసిన చర్యలు అనగా హెచ్చరిక బోర్డ్ లు,క్యాట్ ఐస్,రోడ్డు బోర్డర్ లైన్స్ మొదలగు వాటిని ఏర్పాటు చేస్తూ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని వీటికి అధికారులు ఆదిక ప్రాధాన్యత ఇవ్వాలని దిశ నిర్దేశం చేశారు. గ్రామాలలో శాంతిభద్రతలకు భంగం కలుగకుండా తీసుకునే చర్యలలో భాగంగా గ్రామం ఎంట్రీ మరియు ఎగ్జిట్ లలో సీసీ కేమరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలి. జిల్లా బోర్డర్ మరియు టోల్ గేట్ లలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తు గంజాయి,అక్రమమద్యం, పిడిఎస్ రైస్ ఇతర నిషేదితమైనవి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలి. ఎన్ఫోర్స్మెంట్ పై ప్రత్యక దృష్టి ఉంచాలని, ప్రతిరోజు విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా తనిఖీలు నిర్వహిస్తూ గంజాయి,మద్యం పిడిఎస్ రైస్ అక్రమ రవాణా జరగకుండా నిరోధించాలని, మరియు భాహిరంగ మద్యపానం,డ్రంక్ అండ్ డ్రైవ్ ,మైనర్ డ్రైవింగ్ పై చర్యలు తీసుకోవాలి. నంబర్ ప్లేట్ లేని వాహనాలపై నిఘా ఉంచి తగిన చర్యలు తీసుకోవాలి. పల్లెనిద్ర కార్యక్రమం విరివిగా నిర్వహించి సైబర్ నేరాలు,రోడ్డు ప్రమాదాలు, శక్తి యప్,నేర నియంత్రణ శాంతిభద్రతల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి. నేర సమీక్షా అనంతరం ఆళ్లగడ్డ సబ్ డివిజన్ కు సంబందించిన వాహనాల పనితీరును, వాటి నిర్వహణను పరిశీలించి వాహనాలను ఎల్లప్పడూ పరిశుభ్రంగా, కండీషన్‌లో ఉంచుకోవాలని, వాహనాలకు పెయింటింగ్, పోలీసు స్టిక్కర్స్, అత్యవసర హారన్ మొదలైనవి సక్రమంగా అమర్చుకోవాలని, రిపేరు వస్తే వెంటనే చేయించాలని, క్లీనింగ్, సర్వీసింగ్, ఇంజన్ ఆయిల్ మార్చుట, టైర్ల నిర్వహణ పట్ల డ్రై వర్లు, మెకానిక్‌లు శ్రద్ధ వహించాలని ఎస్పీ సూచించారు. పోలీస్ అధికారుల ఆధీనంలో ఉన్న వాహనాలను సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, సొంత వాహనంలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యాక్రమం నందు జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు ,ఆళ్లగడ్డ డిఎస్పీ ప్రమోద్ పాల్గొన్నారు.

# ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల సమస్యను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం.

**-మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి.**



**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె ఏప్రిల్ 22:**దమంత్రిని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందించిన ఉమ్మడి కర్నూలు జిల్లా జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్అటవీశాఖ లో పనిచేస్తున్న - ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఇచ్చారు. నేడు బనగానపల్లెలోని క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ మంత్రిని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందించడం జరిగింది. రాష్ట్రంలోని అటవీశాఖలో 15 - 20 సంవత్సరాలుగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ లుగా పని చేస్తున్న తమకు ఎటువంటి ప్రమోషన్స్ దక్కలేదని వారు తమ సమస్యను వివరించడం జరిగింది.. తెలంగాణలో కల్పించిన విధంగా ఆంధ్రప్రదేశ్ లో సైతం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ ల నుండి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్ ల ప్రమోషన్ కోటా ను 50% నుండి 85% కు పెంచేందుకు సహకరించాలని మంత్రిని కోరడం జరిగింది. అలాగే పోలీస్ శాఖ మాదిరి అటవీశాఖలో సైతం 15 రోజులు అదనపు ఎర్నడ్ లీవ్స్ అమలు పరచాలని కోరడం జరిగింది.. తద్వారా అటవీ శాఖలో పని చేస్తున్న దాదాపు 2 వేల మంది ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లకు న్యాయం జరుగుతుందని వారు ఆకాంక్షించారు. అటవీశాఖ అధికారులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలియజేయడం జరిగింది.

# వడదెబ్బ మృతులకు4 లక్షల పరిహారం

## విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండాలి

## విపత్తు నిర్వహణ సమీక్షలో మంత్రి అనిత



అమరావతి,ఏప్రిల్ 22,ఆంధ్ర ప్రగతి: వడ దెబ్బతో మృతి చెందినవారి కుటుంబానికి రూ.4 లక్షల పరిహారం ఇవ్వాలని ఆంధప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించినట్టుహోంశాఖ మంత్రి వంగలపూడి అనిత... తాడేపల్లిలోని విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయంలో హోంమంత్రి అనిత సమీక్ష నిర్వహించారు.. వడగాల్పులు, రాబోయే వర్షాకాలానికి సంసిద్ధతపై చర్చించారు.. ఈ సమీక్షలో హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత.. వాతావరణ మార్పులకు తగ్గట్లు అధికార యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలని తెలిపారు.. ప్రణాళికతో సమయం నిర్దేశిరచుకుని ముందుకెళ్లాలి.. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగి వడగాల్పులు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.. గతేడాది నంద్యాలలోని గోస్పాడులో అత్యధికంగా 47.7డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయ్యింది.. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి.. 2025 ఏప్రిల్‌లో పల్నాడు జిల్లా నరసరావుపేటలో 43.7 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు అయ్యిందని తెలిపారు.. 2014, 15, 16 సంవత్సరాల్లో అత్యధికంగా 49.1, 50.3, 48.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయ్యిందన్నారు. ఇక, తాగునీటి అవసరాలపై హోంమంత్రి అనిత ఆరా తీశారు.. పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అప్రమత్తంగా ఉన్నట్లు- సీడీఎంఏ డైరెక్టర్ సంపత్ వెల్లడించారు.. 100 రోజుల యాక్షన్ ప్లాన్‌తో ముందుకెళుతున్నట్లు తెలిపారు సీడీఎంఏ డైరెక్టర సంపత్.. రాబోయే రోజుల్లో వడగాల్పులకు గల అవకాశాలపై హోంమంత్రి ఆరా తీయగా.. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో నీటి నిల్వ చేసినట్లు- తెలిపిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు.. 92 మండలాలను ముందస్తుగా గుర్తించి ఆ ప్రాంత ప్రజలకు నీటి కష్టాలు లేకుండా ఏర్పాట్లు- చేసినట్లు- వెల్లడించారు.. పాఠశాలల్లో నీటితో పాటు-, ఎన్జీవో, విరాళాల ద్వారా మజ్జిగ పంపిణీ చేయాలని స్పష్టం చేశారు.. వడగాల్పుల ద్వారా వడదెబ్బ బారిన పడిన వారి చికిత్స కోసం 5,145 పడకలను, 768 అంబులెన్సులు, సిద్ధం చేయడమే కాకుండా వైద్యులకు తగు శిక్షణనిచ్చి అప్రమత్తంగా ఉంచినట్లు- పేర్కొన్నారు వైద్యశాఖ అధికారి.. వడదెబ్బ మరణాలు లేకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి అనిత.. ఎండలు, వడగాల్పులపై అవగాహన పెంచాలన్న విపత్తు నిర్వహణ శాఖ మంత్రి.. సచివాలయం, వార్డు సచివాలయం, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలను అప్రమత్తం చేసినట్లు- విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్.. రాష్ట్రవ్యాప్తంగా 20 నగరాలలో వడగాల్పుల అప్రమత్తత దిశగా యాక్షన్ ఎ÷-లాన్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు.. ఇక, వడాల్పులతో మృతి చెందిన వారికి రూ.4 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని నిర్ణయించినట్టు వెల్లడించారు.

# సిఐని బెదిరించిన బోరుగడ్డ అనిల్ కేసు

## విచారణను 30కి వాయిదా వేసిన అనంత కోర్టు



అనంతపురం,ఏప్రిల్ 22,ఆంధ్ర ప్రగతి:
సీఐని బెదిరించారన్న కేసులో రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్‌ను అనంతపురం జిల్లా జైలులోనే ఉంచాలని మొబైల్ కోర్టు న్యాయమూర్తి ఆదేశించారు. చర్చి భూమికి సంబంధించిన కేసులో అప్పటి మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ మురళీ కృష్ణను బెదిరించారనే ఆరోపణతో బోరుగడ్డ అనిల్‌పై గతంలో కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి మంగళవారం వాయిదా ఉండటంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉంటున్న అనిల్‌ని పోలీసులు పీటీ వారెంట్‌పై అనంతపురం తీసుకొచ్చారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన మొబైల్ కోర్టు న్యాయమూర్తి.. విచారణను ఏప్రిల్ 30కి వాయిదా వేశారు. తదుపరి వాయిదా దగ్గర్లోనే ఉండటంతో రాజమహేంద్రవరం జైలుకు కాకుండా అనంతపురం జిల్లా జైలులోనే అనిల్‌ను ఉంచాలని న్యాయమూర్తి ఆదేశించారు.

# చేనేత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

**-మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి.**

**-75 మంది చేనేత లబ్ధిదారులకు 28 లక్షలు విలువ చేసే చేనేత మగ్గములు.**

**-నందివర్గం చేనేత సొసైటీలో అవకతవకలపై విచారణ చేస్తాం.**

**-గత వైసీపీ ప్రభుత్వం నేతన్నలను పూర్తిగా గాలికొదిలేసింది.**

**-చేనేతలకు సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని చేనేత శాఖ మంత్రి సవితమ్మను ఫోన్ లో కోరిన మంత్రి.**

**-చేనేతల ఆదాయం రెట్టింపు అయ్యేలా చర్యలు చేపడతం.**







**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె ఏప్రిల్ 22:**
చేనేత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి నేతన్నలకు భరోసా ఇచ్చారు. నేడు నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని నందివర్గంలో చేనేత కార్మికులకు చేనేత మగ్గాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.. బనగానపల్లె క్లస్టర్ డెవలప్ మెంట్ ప్రొగ్రామ్ లో భాగంగా తొలి విడతలో మంజూరైన చేనేత మగ్గాలు, పవర్ లూమ్స్ ను ఈ సందర్భంగా లబ్ధిదారులకు మంత్రి అందజేయడం జరిగింది. దాదాపు 75 మంది చేనేత లబ్ధిదారులకు 28 లక్షలు విలువ చేసే చేనేత మగ్గములు మరియు పరికరాలను నేడు మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ స్థాపన నుంచి చేనేత అంటే తెలుగుదేశం పార్టీ అనే విధంగా నేతన్నలతో అనుబంధం ఉండేదని మంత్రి గుర్తు చేశారు. గతంలో ఎప్పుడు లేని విధంగా నేడు కూటమి ప్రభుత్వంలో చేనేత కుటుంబాలకు 200 ల యూనిట్లు కరెంటు ఉచితంగా ఇస్తున్నామన్నారు. పవర్ లూమ్ యంత్రాలు ఉపయోగించే చేనేత కుటుంబాలకి 500 యూనిట్ల వరకు కరెంటు ఉచితంగా ఇవ్వడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే సాధ్యమయ్యిందన్నారు. నూతనంగా చేనేతల కోసం టెక్స్ టైల్స్ పాలసీని కూడా అమల్లోకి తీసుకొచ్చామని, చేనేతలకు జీఎస్టీ కూడా మినహాయింపు ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. చేనేతలకు 50 ఏళ్లకే ఫించన్ ను కూటమి ప్రభుత్వం అందజేస్తోందని తెలిపారు.. నేతన్నలకు చేనేత రంగంపై ఉన్న మక్కువ, ఆత్మాభిమానం కారణంగా మరో వృత్తికి మారలేని పరిస్థితి నెలకొందన్నారు. గత ప్రభుత్వం చేనేతలను పూర్తిగా గాలికి వదిలేసిన పరిస్థితి నెలకొందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో చేనేతలకు సబ్సిడీపై ఎటువంటి పరికరాలు ఇచ్చిన దాఖలా లేదన్నారు. నందివర్గం చేనేత సోసైటీలో అవకతవకలపై విచారణ చేస్తాం. గతంలో బనగానపల్లె చేనేత క్లస్టర్ లో జరిగిన అవకతవకలు త్వరలో బయట పెడతామని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. చేనేతల సోసైటీని అడ్డం పెట్టుకుని ఇక్కడ నాటి అధికార పార్టీ నేతలు దోచుకుతిన్నారని మంత్రి మండిపడ్డారు.. గత వైసీపీ ప్రభుత్వంలో నందివర్గం చేనేత సోసైటీలో సభ్యత్వాల పేరుతో భారీ అవినీతికి పాల్పడ్డారన్నారు. కేవలం కొద్ది కుటుంబాలకు లబ్ధి పొందే విధంగా నిర్ణయాలు తీసుకున్నారన్నారు. సభ్యత్వాల పేరుతో పాల్పడ్డ అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చేనేత లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్న మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి.

చేనేత లబ్ధిదారులు పరికరరాలు పంపిణీ కార్యక్రమంలో భాగంగా కొంతమంది మహిళలతో మంత్రి స్వయంగా మాట్లాడారు. రోజుకు ఎన్నిగంటలు పని చేస్తారు, ఎంత ఆదాయం వస్తుందనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజుకు 10 గంటలు వరకు పని చేస్తామని, ఆదాయం అంతంత మాత్రమే అని చేనేతలు తెలియజేశారు. బనగానపల్లె చేనేత క్లస్టర్ పరిధిలో ఉన్న లబ్ధిదారులకు ఉపయోగపడే విధంగా ఇంకా మెరుగ్గా ఏం చేస్తే బాగుంటుందో సవివరంగా తెలియజేస్తే చేనేత శాఖ మంత్రి సవితమ్మ దృష్టికి తీసుకెళ్లి నేతన్నల ఆదాయం రెట్టింపు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి అధికారులకు చెప్పడం జరిగింది. చేనేతలకు సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని చేనేత శాఖ మంత్రి సవితమ్మ కోరిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి.

చేనేతలకు పరికరాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా చేనేత శాఖ మంత్రి సవితమ్మతో ఫోన్ లో స్వయంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడారు. చేనేతల నూలు వంటి సమస్యలను మంత్రి సవితమ్మ దృష్టికి మంత్రి తీసుకెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా చేనేత లబ్ధిదారులతో ఫోన్ ద్వారా మాట్లాడి.. చేనేతలకు అండగా నిలుస్తామని మంత్రి సవితమ్మ హామీ ఇవ్వడంతో స్థానిక చేనేతలు సంతోషం వ్యక్తం చేశారు.

నందివర్గంలో అసంపూర్తిగా ఉన్న చేనేత సొసైటి బిల్డింగ్ నిర్మాణంను పూర్తి చేయడానికి ఎంత మేర నిధులు అవసరం అవుతాయో తెలిపాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సోసైటీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయడానికి కృషి చేస్తామని మంత్రి తెలిపారు.

# మహేశ్ బాబుకు ఇడి నోటీసులు

హైదరాబాద్ఏప్రిల్ 22,ఆంధ్ర ప్రగతి:
టాలీవుడ్ సినీ హీరో మహేష్ బాబుకు ఇడి నోటీసులు ఇచ్చింది. సురానా గ్రూప్ , సాయి సూర్య డెవలపర్ల వ్యవహారంలో అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈనెల 27న విచారణకు హజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు. ఇటీవలే సాయి సూర్య, సురానా గ్రూప్‌లలో ఇడీ అధికారులు సోదాలు చేసిన విషయం విదితమే. యాడ్స్‌లో నటించినందుకు 3.4 కోట్లు తీసుకున్నట్లు ఇడి గుర్తించింది. ప్రమోషన్స్ కింద రెండు కంపెనీల నుండి నగదు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మొత్తం రూ. 5.9 కోట్లు తీసుకున్నారని రూ. 3.4 కోట్ల నగదు, రూ. 2.5 ఆర్‌టిజిఎస్ ద్వారా తీసుకున్నట్లు ఇడి అధికారులు గుర్తించారు. కాగా ఈనెల 16న హైదరాబాదులో సురానా గ్రూప్, సాయి సూర్య డెవలపర్లలో ఇడి అధికారులు సోదాలు చేసిన విషయం విదితమే. సురానా గ్రూప్, సాయి సూర్య డెవలపర్లలో ఇడి అధికారులు చేసిన సోదాల్లో భాగంగా సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలోని సురానా ఇండస్ట్రీస్ ఎండి నరేంద్ర సురానా ఇంట్లో భారీగా నగదు పట్టుబడింది. సురానా ఇండస్ట్రీస్ అనుబంధ కంపెనీ, సాయి సూర్య డెవలపర్స్ సంస్థ ఎండి సతీశ్ చంద్రగుప్త ఇంట్లో కూడా భారీగా నగదును సీజ్ చేశారు. సాయి సూర్య, సురానా కార్యాలయాల్లో పలు డాక్యుమెంట్స్ కూడా స్వాధీనం చేసుకున్నారు. కొన్ని రోజుల క్రితమే సాయి సూర్య డెవలపర్స్‌కు చెందిన సతీశ్‌ను సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం విదితమే. వట్టి నాగులపల్లిలో వెంచర్ పేరుతో డబ్బులు వసూలు చేసి సతీశ్ మోసం చేశారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైబరాబాద్ పోలీస్ కేసు ఆధారంగా సాయి సూర్య డెవలపర్స్‌పై ఇడి విచారణ చేపట్టింది. సురానా సంస్థ పలు షెల్ కంపెనీలు ఏర్పాటు చేసి అక్రమ లావాదేవీలకు పాల్పడినట్లు ఇడి అధికారులు గుర్తించారు. సునారా గ్రూప్ మూడు బ్యాంకులకు రూ. 3,986 కోట్లు ఎగ్గొట్టింది. రుణాలు తిరిగి చెల్లించకపోవడంపై సిబిఐ మూడు కేసులు నమోదు చేసింది. సురానాకు అనుబంధంగా సాయిసూర్య డెవలపర్స్ పనిచేస్తోంది. 2021 ఫిబ్రవరిలో సురానా కంపెనీలో జరిగిన ఇడి సోదాల్లో రూ. 11 కోట్ల 62 లక్షల విలువైన బంగారం, నగదు సీజ్ చేశారు. సురానా గ్రూప్ అనుబంధ సంస్థలపై పిఎంఎల్ఎ కేసు కూడా నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా ఇడి అధికారులు దాడులు చేశారు.

# గుజరాత్‌ను ఆపేదెవరు..
# కోల్‌కతాపై ఘన విజయం



వరుస విజయాలతో దూసుకుపోతున్న గుజరాత్ టైటాన్స్ జట్టు తాజాగా మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 39 పరుగుల తేడాతో విజయం సాధించింది.
%వరుస విజయాలతో దూసుకుపోతున్న గుజరాత్ టైటాన్స్ జట్టు తాజాగా మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 39 పరుగుల తేడాతో విజయం సాధించింది.
కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన జీటీ భారీ స్కోరు సాధించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (90)తో పాటు సూపర్ ఫామ్‌లో ఉన్న సాయి సుదర్శన్ (52) కూడా హాఫ్ సెంచరీ సాధించడంతో గుజరాత్ టైటాన్స్ భారీ స్కోరు చేసింది. అనంతరం బౌలర్లు చెలరేగి కోల్‌కతా బ్యాటర్లను కట్టడి చేశారు.
టాస్ గెలిచిన కోల్‌కతా నైట్‌రైడర్స్ కెప్టెన్ అజింక్య రహానే బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో గుజరాత్ బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ తొలి వికెట్‌కు 114 పరుగులు జోడించారు. రస్సెల్ బౌలింగ్‌లో సాయి సుదర్శన్ అవుట్ అయిన తర్వాత క్రీజులోకి వచ్చిన జాస్ బట్లర్ (41) కూడా కీలక రన్స్ చేశాడు. కోల్‌కతా ఫీల్డర్లు క్యాచ్‌లు వదిలేయడం కూడా గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లకు కలిసి వచ్చింది. సెంచరీకి చేరువలోకి వచ్చిన తర్వాత గిల్ అవుటయ్యాడు. గిల్ అవుట్ అయిన తర్వాత పరుగుల వేగం నెమ్మదించింది. దీంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 198 పరుగులు చేసింది. కోల్‌కతా ముందు 199 పరుగుల విజయ లక్ష్యాన్ని ఉంచింది.
199 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతాకు ఆరంభంలోనే షాక్ తగిలింది. తొలి ఓవర్లోనే గుర్బాజ్ (1) అవుటయ్యాడు. ఆ తర్వాత కాసేపటికి మరో ఓపెనర్ నరైన్ (17) కూడా పెవిలియన్ చేరాడు. కెప్టెన్ రహానే (50) హాఫ్ సెంచరీతో ఒంటరి పోరాటం చేశాడు. అయితే మిగతా బ్యాటర్లు వేగంగా పరుగులు చేయలేకపోయారు. దీంతో సాధించాల్సిన రన్‌రేట్ పెరిగిపోయింది. కోల్‌కతా ఓటమి ఖారారైంది. చివరకు 20 ఓవర్లలో కోల్‌కతా 8 వికెట్లు కోల్పోయి 159 పరుగులు మాత్రమే చేసింది. 39 పరుగుల తేడాతో ఓడిపోయింది.



### ఈ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ గేమ్ ఓవర్..
# అద్భుతం జరిగితేనే ప్లే ఆఫ్స్ ఛాన్స్



ఇప్పటికి ఐదు సార్లు ఐపీఎల్‌ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఈ సీజన్‌లో మాత్రం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. వరుస పరజయాలతో సతమతమవుతోంది. ఇప్పటివరకు 8 మ్యాచ్‌లు ఆడిన చెన్నై టీమ్ కేవలం రెండు విజయాలు మాత్రమే సాధించి పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది. ఆదివారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా ఘోర పరాజయం పాలైంది. ఏకంగా 8 వికెట్ల తేడాతో ఓడిపోయింది. ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌లో ఓడిపోవడంతో చెన్నై ప్లే ఆఫ్స్ అవకాశాలు దాదాపు లేనట్టే ముంబైతో ఓటమి అనంతరం మాట్లాడిన చెన్నై కెప్టెన్ ధోనీ (%మీా ఐష్ట్రశీఅఱ%) ఈ సీజన్‌లో చెన్నై కథ ముగిసినట్టే అన్నట్టు మాట్లాడాడు. లఖ్‌నవూపై గెలిచి గాడిన పడినట్టు కనిపించిన ధోనీ సేన ముంబైతో మ్యాచ్‌లో అన్ని రంగాల్లోనూ విఫలమై ఓటమి మూటగట్టుకుంది. దీంతో ఈ సీజన్‌లో ఎలిమినేట్ అయ్యే మొదటి జట్టుగా చెన్నై టీమ్ కనిపిస్తోంది. ఈ సీజన్‌లో చెన్నై టీమ్ తొలి ఐదు మ్యాచ్‌లను రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలో ఆడింది. ఆ ఐదింట్లో కేవలం ఒక్క మ్యాచ్‌లో మాత్రమే విజయం సాధించింది. రుతురాజ్ గైక్వాడ్ గాయం కారణంగా ఐపీఎల్ నుంచి వైదొలిగాడు.రుతురాజ్ స్థానంలో మహేంద్ర సింగ్ ధోనీ కెప్టెన్ అయినప్పటికీ పరిస్థితిలో మాత్రం మార్పు రాలేదు. విజయాలు అందలేదు. ఒక్క లఖ్‌నవూ మ్యాచ్‌లో గెలిచినప్పటికీ తర్వాతి మ్యాచ్‌లో పరాజయం ఎదురైంది. మ్యాచ్ అనంతరం ధోనీ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది ఇదే టీమ్‌తో మంచి కమ్ బ్యాక్ ఇస్తాం అని ఆశాభావం వ్యక్తం చేశాడు. ప్రస్తుత పాయింట్ల పట్టికలో చెన్నై సూపర్ కింగ్స్ పదో స్థానంలో ఉంది. ఇంకా ఆరు మ్యాచ్‌లో మిగిలి ఉన్నాయి. ఆ ఆరు మ్యాచ్‌లలోనూ వరుసగా విజయాలు సాధిస్తే 16 పాయింట్లతో ప్లే ఆఫ్స్‌లో అడుగుపెట్టేందుకు చెన్నై కూడా రేసులోకి వస్తుంది. అలాగే ఇతర జట్ల విజయాలు కూడా చెన్నై ప్లే ఆఫ్స్ అవకాశాలను ప్రభావితం చేస్తాయి.

# ఇక నేరుగా సెబీ మధ్యవర్తిత్వం



న్యూఢిల్లీ: ఎంపిక చేసిన కొన్ని కేసుల్లో ఇక నేరుగా మధ్యవర్తిత్వానికి దిగాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ యోచిస్తోంది. దీనికి సంబంధించి ఒక చర్చా పత్రం విడుదల చేసింది. సంబంధిత పార్టీలు వచ్చే నెల 12లోగా ఈ చర్చా పత్రంపై తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరింది. అయితే ఏ కేసుల్లో పడితే ఆ కేసుల్లో గాకుండా కనీసం రూ.10 కోట్లు లేదా అంతకు మించిన వివాదాలు తలెత్తే కేసులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వివాదాలు, ఒకే అంశంపై పదేపదే తలెత్తే కేసుల్లో మాత్రమే ఈ మధ్యవర్తిత్వం జరపాలని సెబీ యోచిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే ఉన్న ఆన్‌లైన్ డిస్ప్యూట్ రిసొల్యూషన్ (ఓడీఆర్) వ్యవస్థనీ సమూలంగా మార్చేయాలని సెబీ యోచిస్తున్నట్టు సమాచారం.
పక్కాగా ఇన్‌సైడర్ నిబంధనలు: లిస్టెడ్ కంపెనీల షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్‌ను కట్టడి చేసేందుకు సెబీ మరో కీలక చర్య తీసుకుంది. ఈ నిషేధం పరిధిలోకి వచ్చే వ్యక్తుల జాబితాను మరింత విస్తరించింది. లిస్టెడ్ కంపెనీల ప్రమోటర్లు, బోర్డు సభ్యులు, కీలక ఉద్యోగులు, ఆడిటర్లతో పాటు వారి సమీప బంధువులను కూడా ఈ జాబితాలో చేర్చింది. కంపెనీలు వీరి వివరాలను ఆయా కంపెనీల షేర్ల ట్రేడింగ్ విండో క్లోజ్ చేసేందుకు రెండు మూడు రోజుల ముందే డిపాజిటరీలకు తెలియజేయాలని స్పష్టం చేసింది. ఈ నిషేధాన్ని రెండు దశల్లో అమలు చేస్తారు. మొదటి దశ జూలై 1 నుంచి టాప్-500 లిస్టెడ్ కంపెనీల షేర్లకు, అక్టోబరు 1 నుంచి మిగతా కంపెనీల షేర్లకు అమలు చేస్తారు.

# వాహనాలకు సంగీత వాయిద్యాల హారన్లు...గడ్కరీ కొత్త ప్రతిపాదన



రోడ్లపై వాహనాల నుంచి వెలువడే కర్ణకఠోరమైన హారన్ల శబ్దాలకు స్వస్తి పలికే దిశగా కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. వాహనాల హారన్ల కోసం భారతీయ సంగీత వాయిద్యాల నుంచి వచ్చే శబ్దాలను మాత్రమే వినియోగించేలా ఒక కొత్త చట్టాన్ని తీసుకురావాలని యోచిస్తున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ నిబంధన అమల్లోకి వస్తే వాహనాల హారన్లు వినడానికి ఇబ్బందిగా కాకుండా, వినసొంపుగా ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు.'నవభారత్ టైమ్స్' పత్రిక 78వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా నితిన్ గడ్కరీ ఈ విషయం వెల్లడించారు. "అన్ని వాహనాల హారన్లు భారతీయ సంగీత వాయిద్యాల శబ్దాలతో ఉండేలా చట్టం చేయాలని నేను ఆలోచిస్తున్నాను. ఫ్లూట్, తబలా, వయోలిన్, హార్మోనియం వంటి వాయిద్యాల నుంచి వచ్చే శబ్దాలు ఆహ్లాదకరంగా ఉంటాయి" అని గడ్కరీ వివరించారు.ఈ సందర్భంగా దేశంలో వాయు కాలుష్యంపై గడ్కరీ ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం వాయు కాలుష్యంలో రవాణా రంగం వాటానే 40 శాతం ఉందని ఆయన గుర్తు చేశారు. అందుకే తమ ప్రభుత్వం కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలతో పాటు, మిథనాల్, ఇథనాల్ వంటి జీవ ఇంధనాలతో నడిచే వాహనాలను ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు.భారత ఆటోమొబైల్ రంగం సాధిస్తున్న ప్రగతిని కూడా గడ్కరీ ప్రస్తావించారు. 2014లో రూ.14 లక్షల కోట్లుగా ఉన్న ఈ రంగం విలువ, ప్రస్తుతం రూ.22 లక్షల కోట్లకు పెరిగిందని తెలిపారు. అమెరికా, చైనా తర్వాత ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆటోమొబైల్ మార్కెట్‌గా భారత్ అవతరించిందని, ఈ క్రమంలో జపాన్‌ను అధిగమించిందని ఆయన పేర్కొన్నారు.

### ఐపీఎల్ వేలంలో కోట్ల ధర పలికినా...
# బెంచ్ కే పరిమితమైన స్టార్లు !





ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అంటే కేవలం మైదానంలో సిక్సర్లు, ఫోర్ల హోరు మాత్రమే కాదు.. ఆటగాళ్ల వేలంలో ఫ్రాంచైజీలు కుమ్మరించే కోట్ల రూపాయలు కూడా ఎప్పుడూ చర్చనీయాంశమే. తమ జట్టుకు ట్రోఫీ అందించగలరనే నమ్మకంతో ఫ్రాంచైజీలు కొందరు ఆటగాళ్లపై భారీ మొత్తాలను వెచ్చిస్తాయి. కొందరు ఆటగాళ్లు తమ ధరలకు తగ్గట్టు రాణిస్తే, మరికొందరు విఫలమవుతారు.
అయితే, వీటికి భిన్నంగా మూడో కోవలోకి వచ్చే ఆటగాళ్లు కొందరున్నారు. వీరికి వేలంలో కోట్లు పలికినా, మైదానంలో తమ సత్తా చాటే అవకాశం మాత్రం ఇంకా రాలేదు. ఫిట్‌నెస్ సమస్యలు, జట్టు కూర్పులో సర్దుబాట్లు వంటి కారణాలతో ఐపీఎల్ 2025 సీజన్‌లో పలువురు ఖరీదైన ఆటగాళ్లు ఇప్పటివరకు బెంచ్‌కే పరిమితమయ్యారు.
రూ. 2 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ ధరకు అమ్ముడై, ప్రస్తుత సీజన్‌లో ఇంకా అరంగేట్రం చేయని కొందరు కీలక ఆటగాళ్ల వివరాలు ఇలా ఉన్నాయి...

**మయాంక్ యాదవ్ -లక్నో సూపర్ జెయింట్స్ (రూ. 11 కోట్లు)**

గత ఐపీఎల్ (2024) సీజన్‌లో తన మెరుపు వేగంతో మయాంక్ యాదవ్ అందరి దృష్టిని ఆకర్షించాడు. నిలకడగా గంటకు 150 కిలోమీటర్ల వేగంతో బంతులు విసిరి, ఆడిన తొలి రెండు మ్యాచ్‌లలోనే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు గెలుచుకున్నాడు. కేవలం నాలుగు ఐపీఎల్ మ్యాచ్‌ల అనుభవంతోనే భారత టీ20 జట్టులోకి కూడా అడుగుపెట్టాడు. అతని ప్రతిభను గుర్తించిన లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) అతడిని రూ. 11 కోట్లకు రిటైన్ చేసుకుంది. అయితే, గాయాలు మరోసారి ఈ యువ పేసర్‌ను ఆటకు దూరం చేశాయి. లక్నో జట్టుకు ఊరటనిచ్చే విషయం ఏమిటంటే, బీసీసీఐ క్లియరెన్స్ తర్వాత మయాంక్ జట్టుతో చేరాడు. త్వరలోనే మైదానంలోకి దిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

**టి. నటరాజన్ ఢిల్లీ క్యాపిటల్స్ (రూ. 10.75 కోట్లు)**

కచ్చితమైన యార్కర్లు, ఒత్తిడిలోనూ ప్రశాంతంగా బౌలింగ్ చేయగల నైపుణ్యం నటరాజన్ సొంతం. 2024 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున 19 వికెట్లతో టాప్ వికెట్ టేకర్‌గా నిలిచాడు. ఈ ప్రదర్శనతో ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) వేలంలో అతడిని రూ. 10.75 కోట్లకు కొనుగోలు చేసింది. ఆశ్చర్యకరంగా, ఐపీఎల్ 2025 సీజన్ సగం ముగిసినా నటరాజన్‌కు ఇంకా ఆడే అవకాశం రాలేదు. ఐపీఎల్‌లో 61 మ్యాచ్‌లలో 67 వికెట్లు పడగొట్టిన అనుభవం ఉన్నప్పటికీ, డీసీ పేస్ దళం (మిచెల్ స్టార్క్, ముఖేష్ కుమార్, మోహిత్ శర్మ) బాగా రాణిస్తుండటం, నటరాజన్ పూర్తి ఫిట్‌నెస్‌తో లేదని భావిస్తుండటం వల్ల అతనికి తుది జట్టులో చోటు దక్కడం లేదు.

**జాకబ్ బెథెల్ - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (రూ. 2.6 కోట్లు)**

ఇంగ్లండ్‌కు చెందిన ఈ యువ ఆల్-రౌండర్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) రూ. 2.6 కోట్లకు దక్కించుకుంది. గత ఏడాది ఇంగ్లండ్ తరఫున అన్ని ఫార్మాట్లలో అరంగేట్రం చేయడంతో బెథెల్ వెలుగులోకి వచ్చాడు. డైనమిక్ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్, స్పిన్నర్, చురుకైన ఫీల్డర్‌గా పేరున్న బెథెల్, ఈ ఏడాది ఆరంభంలో నాగ్‌పూర్‌లో ఇంగ్లండ్ తరఫున చివరి వన్డే ఆడాడు. ఆర్‌సీబీ ఇప్పటివరకు 8 మ్యాచ్‌లలో 5 విజయాలతో మంచి ప్రదర్శన కనబరుస్తోంది. జట్టు ఓవర్సీస్ ఆల్-రౌండర్ స్థానంలో లియామ్ లివింగ్‌స్టోన్, రొమారియో షెపర్డ్‌లపై ఆధారపడుతోంది. టోర్నమెంట్ కీలక దశకు చేరుకుంటున్నందున, జట్టులో మార్పులు జరిగితే బెథెల్‌కు అవకాశం లభించవచ్చు.

**గెరాల్డ్ కోయెట్జీ - టైటాన్స్ (రూ. 2.4 కోట్లు)**

దక్షిణాఫ్రికాకు చెందిన ఈ యువ పేసర్‌ను గుజరాత్ టైటాన్స్ (జీటీ) రూ. 2.4 కోట్లకు కొనుగోలు చేసింది. 2024లో ముంబై ఇండియన్స్ తరఫున 10 మ్యాచ్‌లలో 13 వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు. అంతర్జాతీయ అనుభవం ఉన్నప్పటికీ, కోయెట్జీకి జీటీ తుది జట్టులో ఇప్పటివరకు చోటు దక్కలేదు. ప్రసిద్ధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్, స్పిన్నర్లు సాయి కిశోర్, రషీద్ ఖాన్‌లతో కూడిన బలమైన బౌలింగ్ లైనప్‌తో జీటీ 7 మ్యాచ్‌లలో 5 విజయాలతో దూసుకుపోతోంది. కగిసో రబాడా జట్టుకు దూరమైనప్పటికీ కోయెట్జీకి అవకాశం రాలేదు. అయితే, టోర్నీ ముందుకు సాగే కొద్దీ గాయాలు, ఆటగాళ్ల అలసట వంటి కారణాలతో అతనికి అవకాశం దక్కవచ్చు.

**రహ్మానుల్లా గుర్బాజ్ - కోల్‌కతా నైట్ రైడర్స్ (రూ. 2 కోట్లు)**

ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన ఈ వికెట్ కీపర్, హార్డ్ హిట్టింగ్ ఓపెనర్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) మెగా వేలంలో రూ. 2 కోట్లకు తిరిగి కొనుగోలు చేసింది. 2023 నుంచి జట్టుతో ఉన్న గుర్బాజ్, గతంలో 14 మ్యాచ్‌లు ఆడినప్పటికీ, ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. కేకేఆర్ ఓపెనర్‌గా క్వింటన్ డి కాక్‌పై నమ్మకం ఉంచింది. డిఫెండింగ్ ఛాంపియన్ అయిన కేకేఆర్ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో దిగువన ఉండటంతో, జట్టు యాజమాన్యం అనూహ్య మార్పులు చేయడానికి వెనుకాడవచ్చు. డి కాక్ విఫలమైతే లేదా జట్టు కూర్పులో మార్పులు చేస్తే తప్ప గుర్బాజ్‌కు అవకాశాలు పరిమితంగానే కనిపిస్తున్నాయి.



# రావుబహద్దూర్‌గా సత్యదేవ్

యంగ్ హీరో సత్యదేవ్ గురించి పరిచయం అక్కర్లేదు. క్యారెక్టర్ అర్టిస్ట్‌గా ఎంట్రీ ఇచ్చి ప్రజంట్ హీరోగా మంచి మంచి కథలు ఎంచుకుంటున్నారు సత్యదేవ్. 'బ్రోచేవారెవరురా', 'ఇస్మార్ట్ శంకర్' , 'సరిలేరు నీకెవ్వరు' వంటి బ్లాక్ బస్టర్ మూవీస్‌తో గుర్తింపు పొంది.. తర్వాత 'బ్లఫ్ మాస్టర్' మూవీ తో హీరోగా మారిన సత్యదేవ్ 'ఉమా మహేశ్వర ఉగ్ర రూపస్య', మూవీ లో అద్భుతంగా పెర్ఫార్మ్ చేసి ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. తర్వాత 'గుర్తుందా శీతాకాలం', 'తిమ్మరుసు', 'గాడ్సే' వంటి మూవీస్ లో నటించి మంచి గుర్తింపు సంపాదించుకున్నాడు. చివరగా 'జీబ్రా' మూవీతో అలరించిన సత్య ప్రజంట్ మరో ప్రాజెక్ట్ తో రాబోతున్నాడు. కేరాఫ్ కంచరపాలెం', 'ఉమామహేశ్వర ఉగ్రరూపశ్య' సినిమాతో ఆకట్టుకొన్న దర్శకుడు వెంకటేష్ మహాతో మూవీ చేస్తున్నాడు ఈ యంగ్ హీరో. అయితే తాజాగా మూవీ టీం ఈ ప్రాజెక్ట్‌కి 'రావు బహదూర్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. అయితే ఈ మూవీలో సత్యదేవ్ గెటప్, క్యారెక్టరైజేషన్ మునుపెన్నడు చూడని విధ్ధంగా విచిత్రంగా ఉంటుందని తెలుస్తోంది. దాదాపు రూ.25 కోట్లతో ఈ సినిమా రూపొందిస్తున్నారు. సత్యదేవ్‌పై ఇంత పెట్టుబడి పెట్టడం అంటే చిన్న విషయం కాదు. కథని నమ్మి నిర్మాతలు చేస్తున్న రిస్క్ అనుకోవాలి. సత్యదేవ్ టాలెంటెడ్ యాక్టర్ ఇందులో అనుమానం లేదు. తనకో కమర్షియల్ హిట్ అవసరం.. అందుకే నిర్మాత రిస్క్ చేస్తున్నట్లు-న్నారు.

# ఆస్కార్ నిబంధనల్లో మార్పులు

## ఎఐ చిత్రాలకుకూడా అవార్డుల్లో చోటు




సరికొత్త నిబంధనలతో వచ్చేయేడు ఆస్కార్ వేడుక జరగనుంది. చిత్రాల ఎంపికలోనూ మార్పులు, చేర్పులు చోటుచేసుకోబుతున్నాయి. సినీ పరిశ్రమ ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డుల వేడుక వివరాలు తాజాగా అకాడమీ వెల్లడించింది. 98వ ఆస్కార్ అవార్డుల వేడుక 2026 మార్చి 15న జరగనున్నట్లు తెలిపింది, అలాగే ఈసారి కొన్ని కొత్త నిబంధనలను ప్రవేశ పెట్టింది. ఆస్కార్ కోసం పోటీ పడనున్న చిత్రాల జాబితాను 2026 జనవరి 22న ప్రకటించనున్నట్లు- అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ వెల్లడించింది. కొన్ని కేటగిరీల్లో ఓటింగ్ విధానంలో మార్పులు చేసినట్లు తెలిపింది. నామినేట్ చేసిన ప్రతి చిత్రాన్ని అకాడమీ సభ్యులు కచ్చితంగా వీక్షించాలని పేర్కొంది. అలాగే అచీవ్‌మెంట్ ఇన్ కాస్టింగ్ అనే కేటగిరీని ప్రవేశపెట్టినట్లు తెలిపింది. ఈ కేటగిరీకి రెండు దశల్లో ఓటింగ్ పక్రియ ఉండనున్నట్లు వెల్లడించింది. ఫైనల్ ఓటింగ్ ముందు కాస్టింగ్ డైరెక్టర్లకు కొన్ని రౌండ్ల టెస్టింగ్ ఉంటుందని వెల్లడించింది.

చిత్ర పరిశ్రమలో పెరుగుతోన్న టెక్నాలజీని దృష్టిలోపెట్టుకున్న అకాడమీ.. ఈసారి ఏఐ ఉపయోగించి తీసిన చిత్రాలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్లు వెల్లడించింది. అయితే ఇది ఇతర చిత్రాలపై ప్రభావం చూపదని పేర్కొంది. ఏఐ చిత్రాల కంటే మామూలు వాటికే ఎక్కువ ప్రాధాన్యం ఉంటు-ందని అకాడమీ తెలిపింది. మానవ మేధస్సుకే తొలిప్రాధాన్యం ఉంటు-ందని వెల్లడించింది. లాస్ ఏంజెలెస్‌లోని డాల్బీ థియేటర్‌లో ఈ 98వ ఆస్కార్ వేడుక జరగనుంది. 2025 జనవరి నుంచి డిసెంబర్ వరకు విడుదలైన చిత్రాలు పోటీ-పడనున్నాయి. అయితే మ్యూజిక్ కేటగిరీలో మాత్రం తుది గడువు 2025 అక్టోబర్ 15గా నిర్ణయించింది.

# బాలీవుడ్ సంచలన క్రైమ్ థ్రిల్లర్ లో శ్రీలీల



తెలుగమ్మాయి శ్రీలీల బాలీవుడ్ ప్రయాణం మొదలైన సంగతి తెలిసిందే. ఆషీకీ 3తో అమ్మడు హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగు పెడుతుంది. కిసిక్ బ్యూటీగా పాన్ ఇండియాలో సంచలనమైన తర్వాత వచ్చిన అవకాశం ఇది. దీంతో ఈ బ్యూటీఫుల్ లవ్ స్టోరీలో అమ్మడు ఎలా అలరిస్తుంది? అన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ చిత్రం సెట్స్ లో ఉండగానే అమ్మడు మరో బాలీవుడ్ ఛాన్స్ అందుకున్నట్లు తెలుస్తోంది.

అయితే ఇది సంచలన వెబ్ సిరీస్ కావడం విశేషం. షాహిద్ కపూర్ ప్రధాన పాత్రలో రాజ్ అండ్ డీకే తెరకెక్కించిన ఫర్జీ ఎంత వెబ్ సిరీస్ ఎంత పెద్ద విజయం సాధించిందో తెలిసిందే. ఇందులో దొంగనోట్లు ముద్రించే వ్యక్తి పాత్రలో షాహిద్ నటన..ఆహార్యం ఎంతగానో అలరించింది. దీంతో ఇటీవలే ఈ సిరీస్ కు సీక్వెల్ గా పర్జీ 2ని కూడా ప్రకటించారు. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు వేగంగా జరుగుతున్నాయి.డిసెంబర్ లో షూటింగ్ ప్రారంభించాలని ప్లాన్ చేస్తున్నారు. దీనిలో భాగంగా షాహిద్ కి జోడీగా శ్రీలీలను పరిశీలిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. బాలీవుడ్ లో కొంత మంది యంగ్ భామలను ఇప్పటికే స్క్రీనింగ్ చేసినప్పటికీ వాళ్లకన్నా శ్రీలీల పర్ఫెక్ట్ గా ఆ రోల్ కి సూటువుతుందట. దీంతో ఆ పాత్రకు శ్రీలీల దాదాపు ఎంపిక ఖరారైనట్లేనని అంటున్నారు. మరి ఈ విషయాన్ని మేకర్స్ ధృవీకరించాలి.ఇప్పటి వరకూ రాజ్ అండ్ డీకే సౌత్ నుంచి సమంతకు పెద్ద పీట వేసారు. ఫ్యామిలీ మ్యాన్ 2 వెబ్ సిరీస్ లో అవకాశం ఇచ్చారు. అటుపై సీటాడెల్ లోనూ సమంతనే తీసుకున్నారు. కానీ ప్యామిలీ మ్యాన్ 3 లో ఛాన్స్ ఇవ్వలేదు. ప్రకటించిన సీటాడెల్ 2ని రద్దు చేసారు. కొత్తగా ఇప్పుడు రాజ్ అండ్ డీకే తమ వరల్డ్ లోకి శ్రీలీలను ఆహ్వానించడం ఇంట్రెస్టింగ్ గా మారింది. శ్రీలీల అక్కడా ప్రూవ్ చేసుకోగల్గితే రాజ్ అండ్ డీకే తో చాలా కాలం పాటు పనిచేసే అవకాశం ఉంటుంది.

# నేను అంతదూరం ఆలోచించను సార్: ప్రియదర్శి



నటుడిగా ప్రియదర్శి కెరియర్ ను పరిశీలిస్తే, ఆయన అంచలంచెలుగా ఎదగడం స్పష్టంగా కనిపిస్తుంది. కెరియర్ ఆరంభంలో హీరో మిత్రబృందంలో ఒకరుగా కనిపిస్తూ వచ్చిన ఆయన, ప్రస్తుతం హీరోగా వరుస సినిమాలు చేస్తూ వెళుతున్నాడు. రీసెంటుగా 'కోర్ట్' సినిమాతో హిట్ కొట్టిన ఆయన, 'సారంగపాణి జాతకం' సినిమాతో, ఈ నెల 25వ తేదీన ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. ఈ సినిమా ప్రమోషన్స్ తో బిజీగా ఉన్నాడు. " ఏదైనా ఒక కథ పట్టుకుని దర్శకుడు నా దగ్గరికి వస్తే, ఆ సినిమాను ఒప్పుకోవాలా వద్దా? అనే విషయాన్ని గురించి మరీ లోతుగా ఆలోచన చేయను. లెక్కలు వేసుకుని నిర్ణయాలు తీసుకోను. నేను ఒక ప్రేక్షకుడిగానే ఆ కథను వింటాను. ఆ కథ బాగుందని నాకు అనిపిస్తే, అప్పుడు నిజాయితీతో నా నిర్ణయం చెబుతాను" అని అన్నాడు. " ఈ కథను నేను కాకుండా వేరే హీరో చేస్తే నేను థియేటర్ కి వెళ్లి చూస్తానా? అని ఒక ప్రశ్న వేసుకుంటాను. తప్పకుండా వెళ్లి చూడవలసిన కథనే కదా అనిపిస్తే, అప్పుడు వెంటనే ఒప్పుకుంటాను. కథపై నాకున్న నమ్మకాన్ని నేను పరీక్షించుకుంటాను అంతే. అలా నమ్మిన కథనే 'కోర్ట్'. అంతే నమ్మకంతో 'సారంగపాణి జాతకం' చేశాను. తప్పకుండా సక్సెస్ అవుతుందనే ఆశిస్తున్నాను" అని చెప్పాడు.

# ఫ్రాంఛైజీల్లో హిట్ స్ట్రాటజీ వేరే లెవెల్



మిగతా ఫ్రాంఛైజీలకు, సీక్వెల్స్‌తో పోలిసేహిట్‌యూనివర్స్‌కున్న ప్రత్యేకతే వేరు. చాలా వరకు సీక్వెల్స్ రెండు లేదా మూడు పార్ట్స్ అవ్వగానే ఎండ్ కార్డ్ వేయాల్సిందే. పెద్దగా చెప్పడానికి, కంటిన్యూ చేయడానికి ఏమీ ఉండదు. ఆడియన్స్ కూడా బోర్ ఫీలవుతారు. కానీ హిట్ సిరీస్ మాత్రం ఇందుకు పూర్తి భిన్నం. ఎందుకంటే ఇదొక డిఫరెంట్ జానర్ మూవీ ఫ్రాంఛైజీ. 2020లో ఫస్ట్ మూవీ హిట్ ద ఫస్ట్ కేస్‌ని విడుదల చేశారు. ఇందులో విశ్వక్‌సేన్ విక్రమ్ రుద్రరాజు అనే పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించి ఆకట్టుకున్న విషయం తెలిసిందే. మర్డర్ మిస్టరీ నేపథ్యంలో శైలేష్ కొలను రూపొందించగా నాని నిర్మించారు. హిట్ సిరీస్‌లో మర్డర్ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమా విశ్వక్‌సేన్‌కు హీరోగా మంచి గుర్తింపుని అందించింది. హీరోగా విశ్వక్ మార్కెట్‌ని కూడా భారీగా పెంచేసి అతని కెరీర్‌లోనే డిఫరెంట్ ఫిల్మ్‌గా నిలిచింది. రూ.6 కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తే బాక్సాఫీస్ వద్ద రూ.11 కోట్లకు మించి వసూళ్లని రాబట్టింది. దీని తరువాత ఇదే ఫ్రాంఛైజీని కొనసాగిస్తూ హిట్ ద సెకండ్ కేస్ పేరుతో మరో సినిమా వచ్చింది. అడివి శేష్ ఇందులో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటించాడుమీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించగా సైకో థ్రిల్లర్‌గా దీన్ని తెరకెక్కించారు. రూ.15 కోట్లతో నిర్మిస్తే అడివి శేష్, నాని క్రేజ్ కారణంగా ఈ మూవీ రూ.42 కోట్లు కలెక్ట్ చేసి ట్రేడ్ వర్గాలని ఆశ్చర్యపరిచింది. ఈ మూవీ ఎండింగ్‌లో హిట్ ద థర్డ్ కేస్‌కి సంబంధించిన విజువల్స్‌ని చూపించడం, ఇందులో నాని రూత్‌లెస్ కాప్ అర్జున్ సర్కార్‌గా పవర్‌ఫుల్ క్యారెక్టర్ లో కనిపించనున్నాడని క్లారిటీ ఇవ్వడంతో హిట్ 3పై అంచనాలు తారా స్థాయికి చేరాయి. ఇప్పటి వరకు విడుదలైన హిట్ 3 ప్రచార చిత్రాలు సినిమాపై మరింత హైప్‌ని క్రియేట్ చేశాయి. ఓవర్సీస్‌లో ఇప్పటికే రికార్డుల మోతమోగించడం మొదలు పెట్టిన ఈ సినిమా మే 1న భారీ స్థాయిలో రిలీజ్ కాబోతోంది. నాని కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లని రాబట్టే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు చెబుతున్న ఈ మూవీ ఎండింగ్‌లో హీరో కార్తి ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. అంటే హిట్ ఫోర్త్ కేస్‌లో కార్తీ హీరోగా కనిపించనున్నాడన్నమాట. ఇదే యూనివర్స్‌లో నందమూరి బాలకృష్ణ కూడా కనిపించే అవకాశం ఉందని ఇన్ సైడ్ టాక్. మిగతా సిరీస్‌లకు హిట్ సిరీస్‌కున్న ప్రత్యేకత కారణంగా దీని ఫ్రాంఛైజీలు నిర్మాతగా నానికి, డైరెక్టర్‌గా శైలేష్ కొలనుకు బోర్ కొడితే తప్ప హిట్ ఫ్రాంఛైజీలకు బ్రేక్ పడే అవకాశమే లేదు. అంటే హిట్ ఫ్రాంఛైజీ నుంచి వరుసగా సిరీస్‌లు వస్తూనే ఉంటాయన్నమాట

# మీ కలలను నిజం చేసుకోవాలనుకుంటున్నారా...

## అందుకు 'వేవ్స్' ఉందిగా!: చిరంజీవి

**కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మే 1 నుంచి 4 వరకు వేవ్స్ సమ్మిట్**
**ముంబయిలోని జియో కన్వెన్షన్ సెంటర్ లో కార్యక్రమం**
**ప్రపంచస్థాయి ఆడియో విజువల్ దిగ్గజాల రాక**
**ఔత్సాహికులకు పిలుపునిచ్చిన మెగాస్టార్ చిరంజీవి**

ప్రపంచ స్థాయి ఆడియో విజువల్ ఎంటర్టయిన్మెంట్ శిఖరాగ్ర కార్యక్రమాన్ని తొలిసారిగా భారత్ లో నిర్వహించనున్నారు. వేవ్స్ (WAVES )పేరిట కేంద్ర ప్రభుత్వ సమాచార ప్రసార శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ భారీ ఈవెంట్ లో టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి కూడా పాలుపంచుకుంటున్నారు. చిరంజీవి వేవ్స్ సలహా సంఘంలో సభ్యుడిగా ఉన్నారు. ముంబయిలోని జియో కన్వెన్షన్ సెంటర్ లో మే 1 నుంచి 4వ తేదీ వరకు ఈ వేవ్స్ సమ్మిట్ జరగనుంది.

ఈ కార్యక్రమం గురించి తాజాగా ఓ ప్రోమో రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలంటూ ఔత్సాహిక కళాకారులకు చిరంజీవి పిలుపునిచ్చారు. "ఒక్కోసారి అనిపిస్తుంటుంటుంది... నేను కాలేజీలో స్టేజి ఎక్కి నాటకం వేయకపోయి ఉంటే ఏమై ఉండేవాడ్నో. మీలో చాలామందికి తెలుసు... ఆంధ్రప్రదేశ్ లోని మొగల్తూరు అనే చిన్న గ్రామం నుంచి పెద్ద ఆశలతో నేను సినీ రంగానికి వచ్చాను. కాలేజీలో వేసిన చిన్న నాటకంతో నా నటనా ప్రస్థానం ప్రారంభమైంది. నటుడ్ని అవ్వాలన్న పెద్ద




కలతో ఆ రోజు స్టేజి ఎక్కి నాటకం ద్వారా తొలి అడుగు వేశాను. ఇప్పుడు మీ వంటి ఔత్సాహికులకు వేవ్స్ తొలి వేదిక. వేవ్స్ ద్వారా కలలు సాకారం అవుతాయి... వేవ్స్ ద్వారా అవకాశాలు లభిస్తాయి. మీరు ఊహించకపోవచ్చు... ఇదే మీ లైఫ్ లో టర్నింగ్ పాయింట్ కావొచ్చు. ఇప్పుడు చెప్పండి... మీరు దిగ్గజాలను కలుసుకోవాలనుకుంటున్నారా? ఇంకెందుకు ఆలస్యం... http://www.wavesindia.org/ పోర్టల్ లో మీ వివరాలను రిజిస్టర్ చేయించుకోండి... వేవ్స్-2025లో పాల్గొనండి... దీన్ని మీ లాంచ్ ప్యాడ్ లా మలుచుకోండి" అని చిరంజీవి ఆ వీడియోలో పిలుపునిచ్చారు.